విశాఖపట్టణం
సోమవారం 25 మే 2026

For a pure tomorrow..

జయ జయహే

jayajayahey.com సంపుటి: 9 సంచిక: 121 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# తిరుపతిలో ఉద్రిక్తత

**భూమన ఇంటి ముట్టడికి హిందూ సంఘాలు, సాధువుల యత్నం..**

**భూమనను అరెస్ట్ చేయాలని హిందూ సంఘాలు, సాధువుల డిమాండ్**

**నిరసనకారులను మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు**

**తిరుమలను భూమన రాజకీయాలకు వాడుకుంటున్నారన్న ప్రముఖ సాధువు**



2



# భగ.. సెగ!

## నిప్పుల కుంపటిలా రాష్ట్రం

## ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు

(అమరావతి – జయజయహే)

ఆకాశంలో వేల అగ్నిబాణాలతో సూర్యారావు విరుచుకుపడుతుంటే.. భూమి అల్లాడిపోతోంది. పొద్దున్నే గడియారంలో ఎనిమిదో గంట కొట్టక ముందే భాస్కరుడు తన వేడి సెగలను భూమిపైకి విసురుతున్నాడు. మధ్యాహ్నానికి మార్తాండుడు ఉగ్రరూపం దాల్చి, మనుషులను నిలువునా ఫ్రై చేసి పారేస్తున్నాడు. 'నేను కన్ను తెరిస్తే మాడిపోవాల్సిందే' అన్నట్టుగా దినకరుడు మండే నిప్పులను కురిపిస్తుంటే, జనం పిట్టల్లా రాలిపోతున్నారు. తెలంగాణలో గురువారం 22 మంది చనిపోయారు. శుక్రవారం అయితే అంతకు మించి. ఏకంగా ఆ ఒక్కరోజే 34 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక శనివారం నాడైతే ఉగ్రరూపం చూపించాడు సూర్యుడు. ఏకంగా 51 మందిని బలితీసుకున్నాడు. ఏపీలోనూ అదే పరిస్థితి. గత రెండు రోజుల్లోనే 37 మంది ప్రాణాలు అనంతవాయువులో కలిసిపోయాయి. ఊపిరి పీల్చుకుందామంటే గాలిలో తేమ లేదు. కేవలం వేడి సెగలు మాత్రమే ఉన్నాయి. పోనీ సూర్యాస్తమయం అయ్యాక ఊరట లభిస్తుందా అంటే అదీ లేదు. రాత్రి వేళ కూడా రవి వెదజల్లిన వేడి.. ...మిగతా 2లో

# జూలై 7న కొత్త కేబినెట్..?

## 43 మంది కొత్త మంత్రులు ప్రమాణం చేసే అవకాశం

## 12 మంది కేంద్ర మంత్రులకు ఉద్వాసన

(ప్రత్యేక ప్రతినిధి – జయజయహే)

**మోదీ 3.0 ప్రభుత్వం మరో కొన్ని రోజుల్లో రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకోనుంది. ఈ కీలక మైలురాయిని పురస్కరించుకుని కేంద్రమంత్రివర్గంలో భారీ మార్పులు, చేర్పులకు అంతర్గతంగా చకచకా సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గత శాఖల వారీగా మంత్రుల పనితీరుపై ప్రధాని మోదీ క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు, లక్ష్యాల సాధన, పరిపాలనా బాధ్యతల్లో ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. కొన్ని శాఖల పేలవమైన పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రధాని.. మంత్రులు, అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. దేశ పురోభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనిక క్రమశిక్షణతో పని చేయాలని, ప్రజాధనాన్ని వీలైనంతగా పొదుపు చేయాలని స్పష్టం చేశారు. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ వ్యవస్థ పనితీరు మారాలని, వికసిత భారత్ లక్ష్యం కోసం రంగాల వారీగా దూసుకుపోవాలని మోదీ పిలుపునిచ్చారు.**



### 20 నుంచి 30 మంది మంత్రుల మార్పు..

ఈసారి జరగబోయే పునర్వ్యవస్థీకరణలో దాదాపు 20 నుంచి 30 మంది మంత్రుల వరకు మార్పులు చేర్పులు ఉండవచ్చని ఢిల్లీ వర్గాల సమాచారం. పనితీరు సరిగ్గా లేని కొందరు సీనియర్లను తప్పించి, వారి స్థానంలో కొత్త ముఖాలకు, ముఖ్యంగా యువత, మహిళలకు కేబినెట్‌లో చోటు కల్పించే యోచనలో బీజేపీ అధిష్ఠానం ఉంది. గతంలో మోదీ 2.0 హయాంలో జూలై 7, 2021న జరిగిన అతిపెద్ద కేబినెట్ ప్రక్షాళనలో 43 మంది కొత్త మంత్రులు ప్రమాణం చేయగా, 12 మంది సీనియర్లకు ఉద్వాసన పలికారు. ఇప్పుడు కూడా అదే తరహాలో గట్టి నిర్ణయాలు తీసుకోనున్నారు. అయితే రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని, క్షేత్రస్థాయిలో పట్టున్న కొందరు అనుభవజ్ఞులైన సీనియర్ నేతలకు మళ్లీ కేబినెట్‌లో చాన్స్ ఇవ్వనున్నారు. రాబోయే 2027 నాటికి దేశంలోని ...మిగతా 2లో



# తిరుమల కిట.. కిట!

## అసాధారణ స్థాయిలో భక్తుల రద్దీ

## వేసవి రద్దీ కారణంగా భక్తుల తాకిడి

(తిరుమల–జయజయహే)

తిరుమలలో శ్రీవారి భక్తుల రద్దీ అసాధారణ స్థాయిలో కొనసాగుతోంది. వేసవి సెలవులు, వీకెండ్ తోడుకావడంతో దేశం నలుమూలల నుండి భక్తులు తిరుమలకు పోటెత్తారు. దీంతో కొండపై ఎటు చూసినా భక్తుల జనసందోహమే కనిపిస్తోంది. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలకు పైగా సమయం పడుతోంది. సాధారణ భక్తులకు తిరుమలేశుడి దర్శనం కల్పించడంలో తిరుమల తిరుపతి దేవస్థానం సరికొత్త రికార్డు సృష్టించింది. సాధారణంగా శుక్రవారాల్లో స్వామివారికి జరిగే ప్రత్యేక పూజా కైంకర్యాల వల్ల దర్శన సమయం తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ, మే నెల 22న చరిత్రలో తొలిసారిగా ఒకే రోజు 94,758 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజామున జరిగే అభిషేక సేవ సమయంలోనూ సర్వదర్శనం క్యూలైన్‌ను యథావిధిగా కొనసాగించడం వల్ల అదనంగా మరో 5,850 మందికి దర్శన భాగ్యం కలిగింది. ఆ రోజు సర్వదర్శనానికి మొత్తంగా 17 గంటలకు పైగా సమయాన్ని కేటాయించారు. ఈ మే నెలలోనే ఒక్కరోజు దర్శనాల సంఖ్య 90 వేలు దాటడం ఇది నాలుగోసారి కావడం విశేషం. ప్రస్తుతం తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి ఉద్యానవన షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. క్యూలైన్లు శ్రీవారి ఆలయం వెలుపల ఉన్న బాటగంగమ్మ ...మిగతా 2లో



## నదిలో మునిగి ఒకే కుటుంబంలోని

# 8 మంది మృతి

### ఉత్తర కన్నడ జిల్లాలో ఘోరం

2

# కర్ణాటకపై సీఎం విజయ్ చూపు

## బెంగళూరు మున్సిపల్ ఎన్నికల్లో 'టీవీకే' పోటీకి సిద్ధం?

**త్వరలో బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు**

**బెంగళూరులో నివసిస్తున్న లక్షలాది మంది తమిళులు**

**కర్ణాటకలో జెండా పాతాలనుకుంటున్న విజయ్**

చెన్నై, జయజయహే

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి అధికార పగ్గాలు చేపట్టిన నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. తన పార్టీ టీవీకే విస్తరణలో భాగంగా ఆయన కర్ణాటక రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా, త్వరలో జరగబోయే బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా కర్ణాటకలో పార్టీ జెండా పాతాలని విజయ్ గట్టి ప్రయత్నాలు ...మిగతా 2లో



## కీవ్‌పై.. 'ఒరెష్నిక్' హైపర్ సోనిక్ క్షిపణితో

# రష్యా దాడి!



న్యూఢిల్లీ, జయజయహే

ఉక్రెయిన్ రాజధాని కీవ్ రీజియన్‌పై డ్రోన్లు, క్షిపణితో రష్యా మరోసారి విరుచుకుపడింది. బిలా సెర్క్వా నగరంపై ఆదివారం ఉదయం జరిపిన దాడిలో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దాడి కారణంగా నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, నివాస సముదాయాలు, పాఠశాలలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గడిచిన నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ యుద్ధంలో ఈ ఆయుధాన్ని ఉపయోగించడం ఇది మూడోసారి మాత్రమే కావడం గమనార్హం. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తీవ్రంగా ...మిగతా 2లో



## ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై

# కేసులు ఎత్తివేయండి

### ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి

2

# గ్రంధాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన సతీష్ కుమార్




విశాఖపట్నం జయ జయహే

విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఎంవీపీ సెక్టార్ 2లో నగర గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పాఠకుల అభిప్రాయాలు కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కి ప్రిపేర్ అవుతున్న విద్యార్థిని విద్యార్థుల అవసరాలను తెలుసుకున్నారు ఈ సందర్భంగా వేసవి విజ్ఞాన శిబిరాలు గ్రంథాలయాల్లో ఏ విధంగా జరుగుతున్నాయో బాలలతో మాట్లాడి చిత్రలేఖనం మెలుకువలను క్షుణ్ణంగా పరిశీలించి అభినందించారు వారు తయారు చేసిన కళాఖండాలను చూసి విద్యార్థినీ విద్యార్థులతో సంభాషించారు పొదుపు కథలు ఆరోగ్య సూత్రాలు,రోడ్డు భద్రత నియమాలు వివరించారు అనంతరం పిల్లలు చిత్రలేఖనం చేసిన చిత్రాలను అభినందిస్తూ ఇంకా వేసవి విడిది కేంద్రాలు దగ్గరలో ఉన్న విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు

# జూలై 7న కొత్త కేబినెట్..?

మొదటి పేజీ తరువాయి

ఏడు కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భాగంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చి నెలల్లోనే ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ రాష్ట్రాలకు.. అలాగే ఈ ఏడాది నవంబర్-డిసెంబర్‌లో గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలను బీజేపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండటంతో ఆయా రాష్ట్రాల నుంచి గెలిచిన నేతలకు కేంద్ర కేబినెట్‌లో సముచిత స్థానం దక్కనుంది. మరోవైపు దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలనే వ్యూహంలో భాగంగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా కొందరు కీలక నేతలకు మంత్రి వర్గంలో ప్రాధాన్యత ఇచ్చే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

జూన్ 9 నాటికి మోదీ ప్రభుత్వం కేంద్రంలో 12 ఏళ్ల సుదీర్ఘ పాలనను పూర్తి చేసుకోనుంది. ఈ లోపే బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ తన నూతన కార్యవర్గాన్ని ప్రకటించే అవకాశం ఉంది. ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికల వల్ల ఈ ప్రక్రియ ఆలస్యమైంది. అలాగే యూపీలో కొత్తగా ఎన్నికైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పంకజ్ చౌదరి కూడా తన కొత్త టీమ్‌ను ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గం నుండి ఉద్వాసనకు గురయ్యే సీనియర్ నేతలను జాతీయ స్థాయిలో నితిన్ నవీన్ టీమ్‌లోకి తీసుకునే చాన్స్ ఉంది. దీనివల్ల ప్రభుత్వంలో బాధ్యతలు తగ్గినా.. పార్టీ పరంగా వారికి తగిన గౌరవం ఇచ్చినట్లు అవుతుందని బీజేపీ భావిస్తోంది. అలాగే మోదీ 3.0 లో ఉన్న మిత్రపక్షాల సూచనల మేరకు కేంద్ర మంత్రివర్గంలో మార్పులు ఉంటాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుంచి మిత్రపక్షాల నేతలకు కేబినెట్‌లో మరికొన్ని కీలక పదవులు దక్కే అవకాశాలు ఉన్నాయి.

### 12 ఏళ్ల పాలన.. దేశవ్యాప్తంగా బీజేపీ భారీ ఉత్సవాలు..

కేంద్రంలో మోదీ సర్కార్ 12 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూన్ 5 నుంచి 21 వరకు "12 ఏళ్ల విశ్వాసం-వికాసం-జన సంక్షేమం" పేరిట దేశవ్యాప్తంగా భారీ ఎత్తున వేడుకలు నిర్వహించాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ రాష్ట్రాల అధ్యక్షులను ఆదేశించారు. జూన్ 8, 9 తేదీల్లో ఢిల్లీలో భారీ మీడియా సంవాద్ కార్యక్రమం, జూన్ 11, 12 తేదీల్లో ఎన్డీయే ముఖ్యమంత్రులు, మంత్రుల ప్రత్యేక సమావేశం జరగనుంది. ప్రత్యేక జనసంపర్క ప్రచారంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ఒక రోజంతా గడపనున్నారు. మూడు రోజుల పాటు జన సంక్షేమ శిబిరాలు నిర్వహించి ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్‌లు చేపడతారు.

జూన్ 5న అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి మండలంలో భారీగా నిర్వహించనున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న ఇంధన సంక్షేమ పరిస్థితుల దృష్ట్యా నేతలు వ్యక్తిగత కాన్వాయ్‌లు కాకుండా కార్ పూలింగ్ లేదా ప్రజా రవాణాను వాడాలని అధిష్ఠానం కఠిన ఆదేశాలు జారీ చేసింది. అలాగే కేవలం స్వదేశీ ఉత్పత్తులనే ప్రోత్సహించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసింది.



## నదిలో మునిగి ఒకే కుటుంబంలోని 8 మంది మృతి

(ప్రత్యేక ప్రతినిధి – జయజయహే)

ఉత్తర కన్నడ జిల్లాలో ఘోరం– నీటిలో మునిగి 8 మంది దుర్మరణం– వెంకటాపుర నదిలో ఒక్కసారిగా నీటి మట్టం పెరగడమే కారణం

కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా భట్కల సమీపంలోని తత్తెహక్కలు నదిలో నత్తగుల్లల సేకరణ కోసం దిగిన ఒకే కుటుంబానికి చెందిన 11 మంది గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఈక్రమంలో 8 మంది మృతదేహాలను వెలికితీశారు. మృతులందరినీ భట్కల తాలూకా సిరాలి గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మిగిలిన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విషాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం (ఎక్స్‌గ్రేషియా) ప్రకటించారు.

"ఉత్తర కన్నడ జిల్లాలోని నదీతీర ప్రాంత ప్రజలు సీజనల్‌గా ఇలా గుల్లలు సేకరిస్తుంటారు. అదే విధంగా శిరాలీ గ్రామానికి చెందిన సుమారు 14 మంది నత్తగుల్లల (కప్పగుల్లలు) సేకరణ కోసం నదిలోకి దిగారు. అయితే వారు నీటి మట్టాన్ని సరిగ్గా అంచనా వేయకుండా నదిలో లోతైన ప్రాంతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో ఒకరిద్దరు కొట్టుకుపోయారు. దీనితో వారికి రక్షించేందుకు మరికొందరు నదిలోకి దూకారు. కానీ వారు కూడా బలమైన నీటి ప్రవాహంలో చిక్కుకుపోయారు. ఇప్పటి వరకు 8 మంది మృతదేహాలను వెలికితీశాం. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయి" అని పోలీసులు తెలిపారు.

### మృతుల వివరాలు

మృతులను ఉమేశ్ మంజునాథ్ నాయక్ (40), లక్షి మహాదేవ్ నాయక్ (42), లక్షి జట్టప్ప నాయక్ (30), లక్షి అప్పన్న నాయక్ (60), లక్షి శివరామ్ నాయక్ (49), జ్యోతి మస్తమ్మ నాయక్ (34), మాలతి నాయక్ (38), మస్తమ్మ నాయక్ (60)గా గుర్తించారు. ఇక నీటి ప్రవాహంలో చిక్కుకున్న నాగరత్న, మహాదేవిలను రక్షించి, వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. రెస్క్యూ సిబ్బంది, పోలీసు బృందాలు, స్థానికులు నదిలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన 8 మంది చనిపోవడంతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి.

### ప్రమాదానికి గల కారణాలు ఏంటి?

ఈ ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా నదిలీ ప్రవాహ ఉద్ధృతి ఒక్కసారిగా పెరిగిందని, గుల్లలను సేకరిస్తూ నదిలోని లోతైన ప్రాంతాల్లోకి వెళ్లిన పలువురు ఈ ప్రవాహంలో చిక్కుకొని కొట్టుకొనిపోయారని పోలీసులు పేర్కొన్నారు. "చేపల వేటలాగే, నత్తగుల్లలు సేకరణ అనేది కొందరికి జీవనోపాధి కల్పించే ఒక వృత్తిగా ఉంది. మునిగిపోయిన వారిలో చాలా మందికి ఈ పనిలో మంచి అనుభవం ఉంది. వారిలో చాలా మందికి ఈత కూడా వచ్చు. అందుకే ప్రమాదానికి గల కారణాలపై ఇంకా నిర్ధరించాల్సి ఉంది" అని పోలీసులు తెలిపారు.

### ప్రభుత్వ సాయం ప్రకటన

ఈ ఘటనపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఎక్స్ వేదికగా స్పందిస్తూ, "అత్యంత విషాదకరమైన, బాధాకరమైన ఘటన ఇది. దీని గురించి తెలిసిన తర్వాత తీవ్ర మానసిక వేదనకు గురయ్యాను. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. మానవతా దృక్పథంతో ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున పరిహారం అందిస్తాం. ఇక గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వారు క్షేమంగా తిరిగి రావాలని దేవుడిని ప్రార్థిద్దాం" అని అన్నారు.

## కీవ్‌పై.. 'ఒరెష్నిక్' హైపర్ సోనిక్ క్షిపణితో రష్యా దాడి!



మొదటి పేజీ తరువాయి

మండిపడ్డారు. సాధారణ పౌరులే లక్ష్యంగా రష్యా భారీ డ్రోన్, క్షిపణి దాడులకు తెగబడిందని.. అందులో శక్తిమంతమైన హైపర్ సోనిక్ 'ఒరెష్నిక్' క్షిపణులను ప్రయోగిస్తోందని ఆరోపించారు. అయితే, దీనిపై ఇప్పటి వరకు రష్యా స్పందించలేదు.

### ఏమిటీ ఒరెష్నిక్ క్షిపణి..?

ఒరెష్నిక్ అనేది హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణి. రష్యా అత్యాధునిక క్షిపణుల్లో ఒకటైన ఈ మిస్సెల్.. గంటకు 13,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. అంటే ధ్వని వేగం కంటే 10 రెట్లు వేగంగా దూసుకెళ్తుంది. ఈ క్షిపణి అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు.

యూరప్‌లోని అన్ని దేశాలు ఈ క్షిపణి పరిధిలోకి వస్తాయని , దీన్ని అడ్డుకునే సామర్థ్యం గల ఆయుధమేదీ లేదని రష్యా గతంలో ప్రకటించింది. తొలిసారిగా దీనిని 2024 నవంబరులో ఉక్రెయిన్ నగరమైన డినిప్రోలోని ఓ ఫ్యాక్టరీ మీద రష్యా ప్రయోగించింది. అప్పట్లో అది అభివృద్ధి దశలోనే ఉంది. ఇటీవలే దీన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్లు సమాచారం. ఉక్రెయిన్‌లోని పశ్చిమ లీవ్ ప్రాంతంలో రష్యా రెండోసారి ఈ క్షిపణి ఉపయోగించగా.. తాజాగా కీవ్ రీజియన్‌పై మూడోసారి ప్రయోగించింది.

## కర్ణాటకపై సీఎం విజయ్ చూపు..

మొదటి పేజీ తరువాయి

చేస్తున్నట్లు తెలుస్తోంది.ఐటీ హబ్ బెంగళూరు నగరంలో స్థానిక కన్నడిగులతో పాటు లక్షలాది మంది తమిళ ప్రజలు దశాబ్దాలుగా నివసిస్తున్నారు. అంతేకాకుండా, నటుడిగా విజయ్‌కు కర్ణాటక వ్యాప్తంగా, ముఖ్యంగా బెంగళూరులో భారీ సంఖ్యలో అభిమాన సంఘాలు, బలమైన ఫాలోయింగ్ ఉంది. ఇటీవల తమిళనాడు ఎన్నికల్లో టీవీకే సాధించిన చారిత్రాత్మక విజయాన్ని బెంగళూరులోని విజయ్ అభిమానులు పెద్ద ఎత్తున వేడుకలు జరుపుకుని తమ మద్దతును చాటుకున్నారు. ఈ సానుకూలతలను ఓట్లుగా మార్చుకుని, అక్కడి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని టీవీకే అధిష్ఠానం భావిస్తున్నట్లు ఇన్‌సైడ్ టాక్ నడుస్తోంది.

కర్ణాటక రాజకీయాల్లోకి టీవీకే ఎంట్రీ ఇస్తుందనే వార్తలు బెంగళూరు రాజకీయ వర్గాల్లో ఇప్పుడే ప్రకంపనలు సృష్టిస్తున్నప్పటికీ... దీనిపై విజయ్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. పార్టీని ఇతర దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించే వ్యూహంలో భాగంగానే ఈ ముందడుగు ఉండబోతోందని, త్వరలోనే బెంగళూరు ఎన్నికల పోటీపై టీవీకే స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.



## భగ.. సెగ!

మొదటి పేజీ తరువాయి

గోడల నుంచి, భూమి నుంచి పైకి ఉబికి వస్తూనే ఉంది. గాలి ఆడక, ఉక్కపోతతో రాత్రిళ్లు కూడా ఊపిరాడకుండా చేస్తోంది. మనుషులే కాదు.. మూగజీవాలు కూడా తట్టుకోలేకపోతున్నాయి. రోజూ లక్షల కోళ్లు చనిపోతున్నాయ్. బర్డ్‌ఫ్లూ కంటే ఎక్కువ నష్టం తీసుకొచ్చింది ఈ ఎండాకాలం. ఒక్క ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే రెండు రోజుల్లో 10 లక్షల కోళ్లు చనిపోయాయ్. తూర్పుగోదావరి జిల్లాలో లక్షలాది కోళ్లు ప్రాణాలు కోల్పోయి, పౌల్ట్రీ పరిశ్రమకు 54 కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. మే 27 వరకు వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' ప్రకటించింది. అంటే.. దివాకరుడు మరి కొన్ని రోజులు తన అగ్ని తాండవాన్ని ఆపనని హెచ్చరిస్తున్నాడు!

సూర్యారావ్ వార్నింగ్‌ను తేలిగ్గా తీసుకోవద్దు. అన్నాడంటే చేస్తాడంతే. నిర్లక్ష్యంగా ఉండి, ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో బయటకు వస్తే ప్రాణాలతో చెలగాటం ఆడడమే. సో, ఆ ఐదు గంటలు ఇల్లు దాటకండి, లేదా నీడ పట్టున ఉండండి. సూర్యుడి కంటికి దొరికితే వడదెబ్బ గ్యారంటీ. దాహం వేసినా, వేయకపోయినా ప్రతి అరగంటకు నీళ్లో, మజ్జిగో, ఓఆర్ఎస్ తాగుతూనే ఉండండి. ఒక్కోసారి నీడలో ఉన్న వాళ్లకి కూడా వడదెబ్బ తప్పదు. ఏదేమైనా, ఇది ప్రకృతి ఇస్తున్న ఓ హెచ్చరిక. అప్రమత్తంగా ఉండడం ఒక్కటే ప్రాణాలకు రక్ష.

ఆంధ్రాలో ఎండలు రికార్డు స్థాయికి చేరాయి. ఆదివారం (మే 24) ఈ సీజన్లోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.మరో 3 రోజుల పాటు ఇదే తీవ్రత కొనసాగే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఆదివారం చిట్యాల (తూర్పుగోదావరి) 48.3°C (ఈ సీజన్లోనే అత్యధికం) నమోదు అయింది.

## తిరుమల కిట.. కిట!

మొదటి పేజీ తరువాయి

గుడి వరకు కిలోమీటర్ల మేర విస్తరించాయి. కంపార్ట్‌మెంట్‌లన్నీ నిండిపోవడంతో, అధికారులు శనివారం మధ్యాహ్నం నుంచి కొత్త భక్తులను క్యూలైన్లలోకి అనుమతించడాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. రద్దీ తగ్గిన తర్వాతే క్యూలైన్లలోకి రావాలని మైకుల ద్వారా భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ సాంకేతికత ద్వారా అధికారులు భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నడకమార్గాలు, వాహనాల ద్వారా వచ్చేవారిని అంచనా వేస్తూ ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేస్తోంది. వేసవి సెలవులు ముగిసే వరకు తిరుమలలో ఇదే రద్దీ కొనసాగే అవకాశం ఉన్నందున, భక్తులు టీటీడీ అధికారులకు సహకరించాలని, తగిన ప్రణాళికతో రావాలని అధికారులు కోరుతున్నారు.

## తిరుపతిలో ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి

తిరుపతిలోని శిల్పారామం సమీపంలో భారీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారంటూ టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల ప్రతినిధులు, సాధువులు ఆయన ఇంటి ముట్టడికి ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు నిరసనకారులను మధ్యలోనే అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తమ శాంతియుత నిరసనను అడ్డుకోవడంపై హిందూ ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒక ప్రముఖ సాధువు మాట్లాడుతూ... తిరుమల అనేది రాజకీయాలకు అతీతమైన పరమ పవిత్ర క్షేత్రమని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది హిందువుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉందని గుర్తుచేశారు. అదృష్టం కొద్దీ రెండుసార్లు టీటీడీ చైర్మన్‌గా పనిచేసే అవకాశం వచ్చినప్పటికీ, భూమన శ్రీవారి సేవను విస్మరించి తిరుమలను రాజకీయం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఆయన చేసిన తప్పులకు గానూ వేంకటేశ్వరస్వామికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, సాధువులు రోడ్డుపైకి వస్తే దాడి చేసేందుకు వైసీపీ శ్రేణులు కుట్ర పన్నాయని హిందూ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసులు ఎత్తివేయండి

హైదరాబాద్, జయజయహే

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు చేసిన ఈ ట్వీట్‌పై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

# శిధిలమైన చింతలపాటి వసతిగృహం

## విష జంతువులతో ప్రజలు ఆందోళన

చోడవరం జూన్ 24 జయ జయహే





చోడవరం ప్రధాన రహదారిలో గల రాజా చింతలపాటి వారి వసతిగృహం శిధిలవస్థకు చేరుకుంది. దీంతో విష జంతువులు వాటిలో ప్రవేశించడంతో చుట్టుపక్కల నివాసితులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం ఈ వసతి గృహం దేవాదాయ శాఖ పరిధిలో నెలకు ఉంది. అయితే తిరిగి తమకు అప్పగించాలని రాజవంశీయులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ శిధిల భవనంలో విష పురుగులు, భయంకరమైన పాములు చేరడంతో భయ బ్రాంతులకు గురవుతున్నారు. చోడవరం - మాడుగుల ప్రధాన రహదారి లో 1948 లో శ్రీ రాజా చింతలపాటి బుచ్చి సీతయ్యమ్మ పేరు మీదుగా లక్కవరం జమిందారీ రాజులు ఈ సత్రం నిర్మించారు. నాడు పేద విద్యార్ధలకు, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా వుండేది. నిర్వహణ లోపంతో నేడు శిధిలావస్థలో చుట్టు ప్రక్కల నివాశిత కుటుంబాలను భయ బ్రాంతులకు గురి చేస్తోంది. విష పురుగులు, భయంకరమైన పాములు, ఊర కుక్కలు, ఊర పందులు. తల దాచుకోవడానికి స్థావరం కావడం తో రాజుల సత్రం చుట్టుపక్కల ఉన్న నివాసిత ఇళ్ల లోకి నిత్యం విష పురుగులు, పాములు చొరబడు తున్నాయని స్తానికులు, మహిళలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలందరిని భయభ్రాంతులకు గురి చేసేలా భారీ పాములు నిత్యం దర్శనమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుండి చోడవరం చదువులకు వచ్చే రాజుల పిల్లలకు ఉచితంగా వసతి, భోజన సదుపాయలు కల్పిచేవారు. పేద విద్యార్థల భోజన సదుపాయలు, సంరక్షణకు పర్యవేక్షకులుండేవారు. సుమారు 50 సంవత్సరాలు పైగా సుదీర్ఘ సేవలందించి, రాజులు సత్రంగా పిలవబడే ఈ బంగ్లా లక్కవరం రాజుల పర్యవేక్షణ, నిర్వహణ లోనే వుండేది. ఇక్కడ చదువుకున్న నాటి రాజుల విద్యార్థులు ఇప్పుడు ఉన్నత స్థాయిలోనే స్థిరపడ్డారు. లక్కవరం రాజులు అనంతరం సత్రం నిర్వహణకు ఆలన, పాలన లేకపోవడం తో శిధిల స్తితికి చేరుకుంది. నిర్వహణ చేయలేక లక్కవరం రాజుల కుటుంభీకులు దేవాదాయ ధర్మదాయ శాఖకు అప్పగించినట్లు బోగట్టా. మరల క్షత్రియ సంఘాలు దేవాదాయ శాఖకు చెందకుండా రాజులు, వారి సంఘం హాయంలోనే వుండాలనేది వారి వాదన. ఈ విషయం మీద దేవాదయ శాఖ, క్షత్రియ సంఘాలు కోర్టుకు వెళ్ళారు. నివాసిత ప్రాంతం మధ్యలో వున్న శిధిల భవనం (రాజుల సత్రం) తొలగించి, విష పురుగులు, భయంకరమైన పాములు నుండి రక్షించాల్సినదిగా స్తానికులు, చుట్టుపక్కల ప్రజలు అధికారులను కోరుతున్నారు. చిన్న పిల్లలు, వృద్దులు, ఎక్కువ జన సమర్ధ0గా వుండే ప్రదేశం నుండి శిధిల భవనం తొలగించి వారికి తక్షణమే రక్షణ కల్పించాలని మహిళలు, ప్రజా సంఘాలు వారు డిమాండ్ చేస్తున్నారు.



# బాలికల రక్షణకు శక్తి టీం అవగాహనలు

## స్వీయ రక్షణ శాశ్వత భవిష్యత్తు

టెక్కలి మే 24 జయ జయహే

నేటి సమాజంలో ఉజ్వల భవిష్యత్తు ఉన్న బాల బాలికల స్వీయ రక్షణ మంచి నిర్ణయాలు వాళ్ళ దయనందిత జీవితంలో గొప్ప మార్గాలను ఎంచుకునే విధంగా చేస్తుందని టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం ప్రతినిధులు స్పష్టం చేశారు. నరసన్నపేట మండలం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిధి లోని ఎన్ సి సి జాతీయ క్యాడిట్ కార్ప్స్ విద్యార్థులకు స్వీయ రక్షణ పొందేందుకు, పోలీస్ శాఖ చట్టపరమైన అంశాలు తక్షణ సహాయం అందించే టోల్ ఫ్రీ నెంబర్లను గూర్చి తగిన వివరాలను అందించారు, వారిలో అవగాహన చైతన్యం కలిగేందుకు ర్యాలీని శక్తి టీం నిర్వహించారు. జాతీయ రహదారులు, గ్రామీణ ప్రాంత రహదారుల్లో ఏదైనా అత్యవసర పరిస్థితులు ఎదుర్కొన్నప్పుడు ప్రతి ఒక్కరూ విధిగా కొన్ని టోల్ ఫ్రీ నెంబర్లను ఉపయోగించాలని పేర్కొన్నారు, ద్విచక్ర వాహనము లైసెన్స్ కలిగి హెల్మెట్ ను తప్పనిసరిగా వాడాలని, టోల్ ఫ్రీ నెంబర్లు 1033,181,112,1091 వినియోగించాలన్నారు, అలాగే బాలికలు వేధింపులకు గురైన వాళ్ళు 1930, మాదకద్రవ్యాలు సమాచారం గూర్చి 1972, గ్రామాలు పట్టణాల్లో బాల్యవివాహాలు అరికట్టేందుకు, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలించేందుకు 1998,, ఈ నెంబర్లకు ఫోన్ చేసి పోలీస్ శాఖకు సమాచారం అందజేయాలని శక్తి బృందం వివరించారు, ఈ అవగాహన కార్యక్రమంలో శక్తి టీం ప్రతినిధులు ఎం గిరిధర్, వి భీమారావు, ధనలక్షి , ఎన్సిసి విద్యార్థులు పాల్గొన్నారు.



# "మన వార్డులో మన ఆదిరెడ్డి"తో ప్రజల్లోకి ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:

రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో కూటమి క్యాడర్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించే లక్ష్యంతో "మన వార్డులో మన ఆదిరెడ్డి" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రకటించారు. జూన్ 12 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రతి వారం రెండు రోజులు రెండు వార్డుల్లో పర్యటిస్తూ కార్యకర్తలతో ముఖాముఖి, అధికారులతో సమీక్షలు, శానిటేషన్ పరిశీలనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తిలక్ రోడ్డులోని రెడ్డీస్ కన్వెన్షన్ హాల్లో జరిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రాజమహేంద్రవరం సిటీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ర్యాంకింగ్‌లో రాజమహేంద్రవరం సిటీ మొదటి ఆరు స్థానాల్లో నిలవడం గర్వకారణమన్నారు. 2024 ఎన్నికలతో పోలిస్తే మరో 8 శాతం ఓటు షేర్ పెరగడం ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.

తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తల సమిష్టి కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కార్యకర్తలను మరింత దగ్గర చేసుకోవడానికే "మన వార్డులో మన ఆదిరెడ్డి" కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, శానిటేషన్ సమస్యలపై అధికారులతో సమీక్షలు నిర్వహించి తక్షణ పరిష్కార చర్యలు చేపడతామన్నారు.

కార్యకర్తలతో ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకుంటామని చెప్పారు. కూటమి పార్టీల మధ్య ఉన్న చిన్నచిన్న సమస్యలను పరిష్కరించి సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో భాగంగా కార్యకర్త ఇంట్లోనే రాత్రి బస చేసి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడతానని తెలిపారు. ఉదయం శానిటేషన్ డ్రైవ్, వాటర్ సప్లై పరిస్థితులను పరిశీలిస్తానన్నారు.

ఇది ఎన్నికల కోసం కాదని, ప్రజల మధ్య నిరంతరం ఉండేందుకే చేపడుతున్న కార్యక్రమమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. "మాకు మేమే పోటీ" అన్న భావనతో లక్ష మెజారిటీ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. నగరంలో కూటమి పార్టీల నాయకత్వానికి ఇప్పటికే 300కు పైగా రాజకీయ పదవులు కల్పించామని వెల్లడించారు.

సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పటివరకు రూ.5.07 కోట్ల విలువైన 596 చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.2.80 కోట్ల విలువైన 138 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా జూన్ 12న ప్రారంభిస్తామని వెల్లడించారు.




# టెక్కలి ప్రజల మంచినీటి దాహార్తిని తీరుస్తున్న దువ్వాడ

## ట్యాంకుల ద్వారా వీధి వీధికి మంచినీరు

టెక్కలి మే 24 జయ జయహే

టెక్కలి పట్టణ ప్రజల మంచినీళ్ళ అవసరాలను పురవీధుల్లో దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాధురి నీళ్ల అవసరం ఉన్న ప్రతి వీధికి నీళ్ల ట్యాంకులను పంపించి వేసవి దాహార్తిని తీరుస్తున్నారు. టెక్కలి కొన్ని ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండి స్థానికులు ఇబ్బందులు పడడంతో స్పందించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ గొల్ల వీధి ఎన్టీఆర్ కాలనీల్లో తమ సొంత నిధులతో ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేందుకు తన బృందముతో సిద్ధమై మంచినీటి సరఫరా చేస్తున్నారు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# కష్టకాలంలో ఆదుకున్న మంత్రి కింజరాపు అచ్చన్నకు కృతజ్ఞతలు

## అనారోగ్య ఇబ్బందుల్లో ఉన్నవారికి రూ 2,42 లక్షలు సహాయం

టెక్కలి మే 24 జయ జయహే

ప్రజల అవసరాలు అనారోగ్య ఇబ్బందులు గ్రామస్థాయిలో కష్టాల్లో ఉన్నవారిని తక్షణమే ఆదుకొని ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ మంత్రి ఇంటి వద్దనున్న క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో పలు గ్రామాల ప్రజలు ఆసుపత్రుల్లో ఉండి చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులతో ఉన్న తమ కష్టాలను, గో డును విజ్ఞప్తుల ద్వారా మంత్రికి తెలియజేయడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి తక్షణ ఆర్థిక సహాయం చెక్కుల ద్వారా అందజేశారు, టెక్కలి మండలం లోని బాధితులు పి తులసి లక్ష్మి కి 64 వేల 5879 రూపాయలు, ఎం మహాలక్ష్మి కు 61 వేల 529 రూపాయలు, ఎస్ విమల కుమారి కి 66 వేల 280 రూపాయలు, పి శివ సాయి కు 50 వేల 19 రూపాయలు చెక్కు రూపంలో అందజేశారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చన్న చేసిన సహాయానికి మేలుకు పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో నానా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేదవారిని గుర్తించి తగిన సమయానికి చేయూతనిచ్చిన మంత్రి కింజరాపు అచ్చన్న కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# పారిశుధ్య కార్మికుల వేతనాలను పెంచాలి

## ఆరేళ్లుగా పెరగని జీతభత్యాలు

## రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చన్నకు కార్మికులు వినతి

టెక్కలి మే 24 జయ జయహే



శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని టెక్కలి గ్రామ పంచాయతీలో కాంట్రాక్ట్, టెండర్ ప్రాతిపదికన పనిచేస్తున్న పారిశుధ్య, ప్రజా ఆరోగ్య సిబ్బంది, ఎలక్ట్రిషి న్స్, కార్మికులకు ఆరేళ్లుగా 67 మంది పనిచేస్తున్నామని నేటికీ మా జీతభత్యాలు పెరుగుదల లేదని చాలీచాలని వేతనాలతో బతుకు తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ ఇప్పటికైనా మా జీతాలు పెంచాలని కార్మికులు మంత్రి అచ్చన్నకు వినతి పత్రం అందజేశారు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు సానుకూలంగా స్పందించారని కార్మికులు తెలిపారు.



# కలెక్టర్ గారు.... మాకు మంచి నీళ్లు ఇవ్వండి

## చేతులు జోడించి నమస్కరిస్తున్నాం

## ఆదివాసి గిరిజనులు వినూత్న నిరసన కార్యక్రమం

అనంతగిరి (జయ జయహే)

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం అనంతగిరి పంచాయతీ కేంద్రంలో 12 కుటుంబాలు జీవనం సాగిస్తూ ఉన్నారు. నీరు తెచ్చుకోవాలంటే ఎత్తైన ఘాటి దిగుతూ. ఎక్కుతూ నీరు మోసుకోవాల్సిన పరిస్థితి. వేసవికాలం వల్ల నీళ్లు అడుగట్టు పోయాయి. నీరు కోసం రోజల్లా కష్టపడే పరిస్థితి. సమస్య ను ఎంపీడీవో పీజీఆర్ఎస్ కు పిర్యాదు చేసాం. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. నెలరోజులు గడిచిపోయాయి. నేటికీ పనులు ప్రారంభించలేదు. డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పవన్ కళ్యాణ్ స్వచ్ఛమైన నీరు అందించాలని అధికారులకు ఆదేశించారు. కానీ మా గ్రామాల్లో కోట చెరువు నీరు తాగవలసిన వస్తుంది. తరచూ అనారోగ్యం గురవునప్పుడల్లా. డోలి కట్టుకొని మూడు కిలోమీటర్లు అనంతగిరి కేంద్రానికి వెళ్లవలసిన పరిస్థితి. మా పంచాయతీ కేంద్రంలో టూరిజం డెవలప్ అయింది. మాకు నీళ్లు లేక అనేక ఇబ్బందులు గురవుతున్నాము తక్షణమే మంచినీటి సమస్య పరిష్కారం చేయాలని కావులతో వినూత్నంగా నిరసన కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి కొర్ర గోపి. కుర్ర కౌసల్య గ్రామస్తులు పాల్గొన్నారు



# ఘనంగా ఘటాభిషేకం

## అమ్మవారికి పెద్ద ఎత్తున పసుపు నీళ్లు సమర్పించిన భక్తులు

మాడుగుల మే 24 జయ జయహే

మాడుగుల మోదకొండమ్మ వారి జాతర నేపథ్యంలో ప్రతి ఏడాది వలె ఈ ఏడాది కూడా అమ్మవారికి పెద్ద ఎత్తున ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి భక్తులు పెద్ద ఎత్తున శతకం పట్టుకు చేరుకొని అమ్మవారికి పసుపు కుంకుమ వేపాకులతో కూడిన నీటిలో అభిషేకం నిర్వహించారు. ఎండలు మెండుగా కాస్తున్న నేపథ్యంలో గ్రామంలో చల్లదనం చేకూర్చాలని భక్తులు కోరుకుంటూ ఈ అభిషేకం చేపట్టారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా మహిళలు కాలికి చెప్పులు లేకుండా ఇంటి నుంచి మడి బట్టలతో పసుపు కుంకుమ వేపాకులతో కూడిన నీటిని కడవలతో తీసుకువచ్చి అమ్మవారి పాదాలకు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించి దర్శించుకున్నారు. ప్రతి ఏడాది కూడా అమ్మవారి జాతరకు చల్లదనం చేకూర్చాలని భక్తులు ఈ విధంగా మొక్కుతుంటారు. అయితే ఈ ఏడాది మరింత ఎక్కువగా ఎండలు ఉండడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇదే పరిస్థితి జాతర నాటికి ఉంటే భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో చల్లదనం చేకూర్చాలని గ్రామస్తులకు జాతరకు వచ్చే భక్తులకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా చల్లదనం చేకూర్చాలని అమ్మవారిని భక్తులు కోరుకున్నారు.



# ప్రభుత్వ పాఠశాలలో ఎన్రోల్మెంట్ పై ప్రత్యేక శ్రద్ధ వహించండి

## డీఈవో అప్పారావు నాయుడు

మాడుగుల మే 24 జయ జయహే

ప్రభుత్వ పాఠశాలలో పిల్లల సంఖ్య పై పెంచేందుకు ఉపాధ్యాయులు పాఠశాల కమిటీ విద్యార్థి తల్లిదండ్రులు తగు శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు సూచించారు. ఆదివారం మాడుగుల మండలంలో ఆయన ప్రత్యేక ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని ఎంఈఓ దేవుడమ్మతో కలిపి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గాదిరాయి పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులను గాదిరాయి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. సందర్భంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులను డీఈవో అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో ప్రతి పాఠశాలలోనూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలాగా విద్యార్థుల సంఖ్య పెరగాలని ఆదేశించారు ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వ పాఠశాలలకు గల వ్యత్యాసాన్ని సౌకర్యాలను తల్లిదండ్రులకు విద్యార్థులకు వివరించాలని సూచించారు.

## సృష్టికర్తకు కృతజ్ఞతాంజలి

(కవిత)

రచన:తిరుమలరావు పామరాజు

సెల్ నెం:9573547496

ఓ ప్రభూ...

శ్వాసగా మారుతూ ప్రాణాన్ని నింపిన గాలినిచ్చిన నీకు వందనం!

ఆకలి తీరుస్తూ శక్తినిచ్చే అన్నపూర్ణమ్మ భూదేవి సాక్షిగా నీకు వందనం!

తలదాచుకోవడానికి నీడనిచ్చే ఇల్లు,

ప్రేమను పంచే కుటుంబం, తోడుండే స్నేహితుల బంధం..

ఇవన్నీ నా జీవనానికి నువ్వు ఇచ్చిన అమూల్యమైన వరం!..

కనులకు విందు చేసే ప్రకృతి సౌందర్యం...

అడవుల పచ్చదనం, నదుల పరవళ్ళు,

సెలయేర్ల సంగీతం, జీవజాలపు వైవిధ్యం..

ప్రతి అణువులోనూ నీ అద్భుత సృష్టికి నిదర్శనం!

కష్టసుఖాల పయనంలో తోడుగా నిలిచి,

చక్కని జీవితాన్ని ప్రసాదించిన ఓ దైవమా!

నిన్ను చూసే కన్నులు, తలచే మనసు,

ఈ సృష్టిని అనుభవించే అదృష్టం ఇచ్చినందుకు..

నిరంతరం నీకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు!

## "మమకారం"

చేతులు విడిచేసిన తరువాత తెలిసే వెలుగు మమకారం
చేరువై నిలిచిన నీడను దూరం చేసే మమకారం

కన్నీటి చప్పుళ్లు వినిపించవు స్వార్థపు లోకాలలో
గుండెల్ని నిశ్శబ్దంగా చీల్చి నవ్వే మమకారం

తోబుట్టువు అనిపించేది రక్తబంధం వల్ల కాదు
ఆత్మకు అండగా నిలిచే ప్రేమే నిజమైన మమకారం

అవసరాల వానలో ఆశ్రయం తీసుకున్న మనసే
ఎండల్లో నీడలను మరచి పోయే మమకారం

గెలుపంటే మనుషుల్ని దాటిపోవడం కాదని
ఓడిన హృదయాలే నెమ్మదిగా నేర్పే మమకారం

బంధాలు మాటల్లో మాత్రమే బతికే కాలమొచ్చేసరికి
మౌనాల గోడల మధ్య కరిగి పోయే మమకారం

"విశ్వం" ప్రేమ లేకుంటే రక్తం కూడా చల్లారిపోతుంది
మనిషిని మనిషికే పరాయిని చేసే మమకారం

డాక్టర్ విశ్వేశ్వరరావు కొణపల
రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్
9640687608

# తెలుగు సాహిత్యానికి ఒక విలక్షణ స్వరం బుచ్చిబాబు

(సి.హెచ్.ప్రతాప్)

**శివరాజు వెంకట సుబ్బారావు అనే అసలు పేరుతో కాకుండా 'బుచ్చిబాబు' అనే కలం పేరుతో తెలుగు సాహిత్య జగత్తులో ప్రఖ్యాతి గాంచిన ఈ రచయిత ఒక అనన్య సామాన్య సృజనశీలి. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో ఒక సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన ఆయన ఉన్నత విద్యాభ్యాసం ముగించుకుని ఆంగ్ల అధ్యాపకుడిగా పనిచేశారు. ఆ తర్వాత ఆల్ ఇండియా రేడియోలో సుదీర్ఘ కాలం సేవలందించారు. ఈ రెండు రంగాల అనుభవాలు ఆయనకు విస్తృత లోకజ్ఞానాన్ని, భిన్న మనస్తత్వాలు కలిగిన వ్యక్తులను పరిశీలించే అవకాశాన్ని కల్పించాయి. ఆ పరిశీలనలే ఆయన సృజించిన కథలు, నవలలు, నాటకాలకు ప్రధాన మూలవస్తువులుగా మారాయి. తెలుగు కథా సాహిత్య ప్రక్రియకు అంతశ్చేతనా ప్రవాహ రూపాన్ని, నూతన శైలిని పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. కేవలం బాహ్య ప్రపంచ సంఘటనలను కాకుండా, మానవ మనస్సులోని నిగూఢ కోణాలను ఆవిష్కరించడం ఆయన ప్రత్యేకత.**





బుచ్చిబాబు కథలు, వ్యాసాలు ఆలోచనాత్మక దృక్పథాన్ని కలిగి ఉంటాయి. ఆధునిక పాశ్చాత్య తత్వశాస్త్ర భావనలను తెలుగు సాహిత్యానికి అన్వయించిన అగ్రగామి రచయితలలో ఆయన ఒకరు. సమాజంలో మారుతున్న విలువలు, మధ్యతరగతి కుటుంబాలలోని నైతిక సంఘర్షణలు, స్త్రీ పురుష సంబంధాలలోని సంక్లిష్టతలు ఆయన రచనలలో ప్రధానంగా కనిపిస్తాయి. నాటక కర్తగా కూడా ఆయన రేడియో రంగంలో ఎన్నో ప్రయోగాత్మక నాటికలను రచించి ప్రసారం చేశారు. శబ్ద శిల్పంలో, సంభాషణల చాతుర్యంలో ఆయన శైలి విశిష్టమైనది. ఒక సాదాసీదా సన్నివేశాన్ని సైతం తాత్విక భూమికతో ముడిపెట్టి రాయడం ఆయన కలం అలవాటు. పాత్రల మనోవిశ్లేషణను అత్యంత ప్రతిభావంతంగా చేయడం ద్వారా పాఠకులను తమ సొంత అంతరంగంలోకి తొంగి చూసుకునేలా ప్రేరేపించగలిగారు.

తెలుగు నవలా ప్రపంచంలో బుచ్చిబాబు సృష్టించిన 'చివరకు మిగిలేది' ఒక అద్భుత క్లాసిక్ గ్రంథంగా నిలిచిపోయింది. దయానిధి అనే ప్రధాన పాత్ర చుట్టూ తిరిగే ఈ నవల కేవలం ఒక కథ కాదు, అది ఒక మానసిక అన్వేషణ. మాతృప్రేమకు నోచుకోని ఒక యువకుడి మానసిక ఆందోళనలు, సమాజం పట్ల అతని విముఖత, చివరకు అతను కనుగొనే జీవన సత్యం ఈ నవలలో అద్భుతంగా చిత్రీకరించబడ్డాయి. ఈ ఒక్క నవల తెలుగు నవలా చరిత్రను మలుపు తిప్పిందని చెప్పవచ్చు. జీవితం అంటే ఏమిటి, మానవ సంబంధాల గమ్యస్థానం ఎటు అనే ప్రశ్నలకు సమాధానాల వెతుకులాట ఈ గ్రంథంలో కనిపిస్తుంది. భావ తీవ్రతను ప్రకటించేటప్పుడు ఆయన ఎక్కడా అతిశయోక్తులకు పోకుండా సంయమనంతో కూడిన శైలిని ప్రదర్శించారు.

బుచ్చిబాబు సాహి త్య ప్రస్థానంలో ఎన్నదగిన ప్రధాన రచనలలో 'చివరకు మిగిలేది' అత్యంత ప్రసిద్ధ నవల కాగా, 'అజ్ఞానం' అనే వచన కావ్యం ఆయన తాత్వికతకు అద్దం పడుతుంది. వీటితో పాటు 'ఆశావాది', 'ఆద్యంతాలు మధ్య రాధ', 'నా అంతరంగ కథనం' వంటి విశిష్ట సృజనలు ఆయన కలం నుండి జాలువారాయి. ఆంగ్ల సాహిత్యంపై ఆయనకున్న పట్టును 'షేక్ స్పియర్ సాహిత్య పరామర్శ' నిరూపించగా, 'మేడమెట్లు' కథా సంపుటి, 'ఆత్మవంచన' నాటకం, 'మరణం' వంటి రచనలు మానవ సంబంధాలలోని సంక్లిష్టతలను, మనస్తత్వాలను లోతుగా ఆవిష్కరించాయి.

ఆయన వ్యాసాలలో సృజనాత్మకతతో పాటు తీవ్రమైన విశ్లేషణాత్మక దృక్పథం కనిపిస్తుంది. షేక్స్పియర్ నాటకాలపై, ప్రపంచ ప్రసిద్ధ చిత్రకారులపై ఆయన రాసిన వ్యాసాలు ఆయనకున్న విస్తృత అధ్యయన సంపదను తెలియజేస్తాయి. భాషా వినియోగంలో ఆయన ఎంతో జాగ్రత్తలు తీసుకునేవారు. అనవసరమైన పదజాలం లేకుండా మితంగా రాస్తూనే అమితమైన భావాన్ని వ్యక్తపరచడం ఆయన శైలి ప్రత్యేకత. భావ ప్రకటనలో స్పష్టత, వాక్య నిర్మాణంలో లయబద్ధత ఆయన రచనలను ఉన్నత ప్రమాణాలలో నిలబెట్టాయి. భావోద్వేగాల కంటే మేధోపరమైన విశ్లేషణలకే ఆయన రచనలలో ప్రాధాన్యత ఎక్కువ. అందుకే ఆయన సాహిత్యం చదువరులను కేవలం ఉద్వేగానికి గురిచేయకుండా ఆలోచింపజేస్తుంది.
జీవితాన్ని ఒక కళగా, ఒక తపస్సుగా భావించిన బుచ్చిబాబు యాభై ఒక్క సంవత్సరాల స్వల్ప వ్యవధిలోనే భౌతిక జీవితాన్ని ముగించినప్పటికీ, ఆయన అందించిన సాహిత్యం చిరస్మరణీయమైనది. ప్రతీకల ద్వారా, అంతర్ముఖ ప్రయాణాల ద్వారా ఆయన తెలుగు కథకు అంతర్జాతీయ స్థాయి గౌరవాన్ని తీసుకువచ్చారు. జీవితంలో ఏదీ శాశ్వతం కాదనే వైరాగ్య భావన కంటే, ఉన్న జీవితాన్ని ఎంతవరకు అవగాహన చేసుకున్నామనే జిజ్ఞాసను ఆయన అక్షరాలు రేకెత్తిస్తాయి. సమకాలీన రచయితల కంటే భిన్నమైన పంథాను ఎంచుకుని, చివరి శ్వాస వరకు సాహిత్య సేవకే అంకితమైన ఆయన ఆధునిక తెలుగు సాహిత్య వికాసానికి గట్టి పునాది వేశారు. తెలుగు భాష ఉన్నంతవరకు ఆయన ఆలోచనలు, ఆయన సృష్టించిన పాత్రలు సజీవంగానే ఉంటాయి.

బుచ్చిబాబు రచనల్లో "చివరకు మిగిలేది" అత్యంత ప్రసిద్ధమైన నవల. ఇప్పుడు లభ్యంవుతున్న సమాచారం ప్రకారం బుచ్చిబాబు మొత్తం మీద సుమారు 82 కథలు, ఒక నవల, ఒక వచన కావ్యం, సుమారు 40 వ్యాసాలు, సుమారు 40 నాటికలు/నాటకాలు, ఒక పరామర్శ గ్రంథం, స్వీయచరిత్రలో తొలి భాగం, పీఠికలు, పరిచయాలు వెలువరించారు. ఆయన ఆంగ్ల రచనలలో "సంతోష్ కుమార్" అనే పేరును కూడా ఉపయోగించారు.

## ఏ నక్షత్రం రోజు వెంకటేశ్వర స్వామి వారిని దర్శిస్తే

# విశేష ఫలితాలు కలుగుతాయి

(పుట్టా శ్రీనివాసరావు)

**కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఏ నక్షత్రం రోజున దర్శించుకుంటే ఎలాంటి ఫలితాలు లభిస్తాయో తెలుసుకుందాం..**

అశ్వనీ నక్షత్రంనాడు శ్రీనివాసుని దర్శిస్తే ఎటువంటి అనారోగ్యమైనా నశిస్తుంది,

రెండవదైన భరణీ నక్షత్రంనాడు ఆనందనిలయంలోని స్వామిని దర్శించినవారికి అపమృత్యుభయం తొలగిపోతుంది.

మూడవదైన కృత్తికా నక్షత్రం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని జన్మనక్షత్రం. ఆనాడు శ్రీనివాసుని దర్శించినవారికి చక్కటి చదువు లభిస్తుంది. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు.

రోహిణీ నక్షత్రంనాడు స్వామిని దర్శిస్తే ..ఎటువంటి మానసిక సమస్యలైనా ఇట్టే తొలగిపోతాయి.

ఇక అయిదవదైన మృగశిర స్వామికి ఎంతో ప్రీతిపాత్రమైనది. మాసాలలో మార్గశిర మాసం తానేనంటాడు శ్రీమన్నారాయణులవారు. పూర్వకాలంలో కొత్త సంవత్సరం మార్గశిర నక్మ్షత్రంనాడే ప్రారంభమయ్యేది. ఆ నక్షత్రం రోజున శ్రీనివాసుని దర్శించినవారికి.. సర్వ శుభాలు కలుగుతాయి.

తరువాత వచ్చే ఆరుద్ర నక్షత్రానికి అధిదేవత రుద్రుడు. ఈ నక్షత్రం రోజున స్వామిని దర్శించినవారికి ఎటువంటి ఆపదలూ కలుగవు. స్వామివారి రామచంద్రుని అవతారంలో జన్మ నక్షత్రమైన పునర్వసునాడు ఆనంద నిలయంలోని స్వామిని దర్శిస్తే ఎటువంటి కష్టాలైనా తొలగిపోతాయి. ప్రత్యేకించి ఆర్థిక బాధలు ఉన్నవారు, మానసిక సమస్యలు ఉన్నవారు పునర్వసునాడు స్వామిని దర్శిస్తే చాలా శ్రేయస్కరం. కుటుంబంలోశాంతి సౌభాగ్యాలు వెల్లివెరుస్తాయి.

ఇక పుష్యమీ నక్షత్రంనాడు స్వామిని దర్శిస్తే.. వెయ్యి జన్మల పాపం నశిస్తుంది.

ఆశ్లేష నక్షత్రానికి అధిదేవత ఆదిశేషుడు.




ఆ రోజు స్వామిని దర్శించినవారికి.. ఎటువంటి భయాలైనా తొలగిపోతాయి. శారీరక మానసిక సమస్యలన్నీ ఇట్టే మాయమౌతాయి. మనస్సంతా ప్రశాంతత తో నిండి పోతుంది.

మఖానక్షత్రంనాడు శ్రీనివాసుని దర్శిస్తే.. అష్టైశ్వర్యాలు లభిస్తాయి.

జగన్మాత నక్షత్రమైన పూర్వఫల్గుణి (పుబ్బ) నక్షత్రంనాడు శ్రీ స్వామివారిని దర్శిస్తే.. కన్యలకు త్వరగా వివాహం జరుగుతుంది. వివాహం ఆలస్యం అవుతున్న యువకులకు కూడా వెంటనే పెళ్ళి నిశ్చయమౌతుంది. స్వామివారి ప్రియసఖి శ్రీమహాలక్ష్మి నక్షత్రమైన ఉత్తరఫల్గుణి నాడు ఆనందనిలయంలో స్వామిని దర్శించినవారికి..సర్వసౌభాగ్యాలు కలుగుతాయి. ఎంతో ఐశ్వర్యవంతులౌతారు..

హస్తా నక్షత్రంనాడు శ్రీనివాసుని దర్బ్శించినవారికి ఎటువంటి అనారోగ్యమైనా క్షణంలో తొలగిపోతుంది.

చిత్తా నక్షత్రంనాడు స్వామివారిని దర్శిస్తే.. యశస్సు, సకల సంపదలు కలుగుతాయి. శరీరం నూతన తేజస్సుతో నిండిపోతుంది.

తదుపరి స్వాతి నక్షత్రం
శ్రీ నరసింహ స్వామివారి జన్మనక్షత్రం. స్వామి నరసింహునిగా అవతరించి హిరణ్య కశిపుని సంహరించాడు. తిరుమల కొండ ఎక్కేటప్పుడు మధ్యలో వచ్చే శ్రీయోగ నరసింహస్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి కలది. స్వాతి నక్షత్రం నాడు శ్రీనివాసుని దర్శిస్తే అపమృత్యు భయం తొలగిపోతుంది.
ఎటువంటి ప్రమాదాలు జరగవు. ఎటువంటి ఆపదలు కలుగవు.

ఇక నక్షత్ర సముదాయంలో పదహారవదైన..
విశాఖ నక్షత్రంనాడు శ్రీనివాసుని దర్శించినవారికి త్వరలో వివాహమౌతుంది. కన్యలకు మంచి యువకులు,యువకులకు మంచి కన్యలు, జీవితభాగస్వాములుగా లభిస్తారు. విశాఖ నక్షత్రాన్ని రాధా నక్షత్రం అని, వైశాఖమాసాన్ని రాధామాసమని కూడా అంటారు.
రాధా నక్షత్రానికి తరువాత వచ్చేదే అనూరాధ.
ఈ నక్షత్రంనాడు స్వామివారిని దర్శించినవారికి సర్వసౌభాగ్యాలు కలుగుతాయి. ఎంతో కాలంనుండి తీరని అప్పులు కొద్దినెలల్లోనే తీరిపోతాయి.

ఇక తరువాతిదైన జ్యేష్టా నక్షత్రంనాడు స్వామివారిని దర్శించినవారికి ఉన్నత పదవులు లభిస్తాయి. సర్వసంపదలూ చేకూరుతాయి.

మూలా నక్షత్రం చదువుల తల్లి సరస్వతీ దేవి జన్మ నక్షత్రం. ఈరోజు స్వామివారిని దర్శించినవారికి సర్వవిద్యలూ లభిస్తాయి. విద్యార్థులు పరీక్షలలో అద్భుత విజయం సాధిస్తారు.

పూర్వాషాఢ నక్మ్షత్రంనాడు శ్రీనివాసుని దర్శిస్తే ఎంతో సంపద కలుగుతుంది.

ఉత్తరాషాఢ నాడు స్వామివారిని దర్శిస్తే ఎటువంటి అనారోగ్యమైనా తొలగిపోతుంది. సర్వసౌభాగ్యాలూ కలుగతాయి. మనస్సంతా ప్రశాంతత కలుగుతుంది.

ఇక తరువాత వచ్చేదే శ్రీమన్నారాయణులవారి జన్మ నక్షత్రమైన శ్రవణానక్షత్రం.

ఆ రోజు ఆనంద నిలయంలో స్వామివారిని దర్శించినవారు జీవించినంత కాలం సుఖంగా జీవించి చివరన ముక్తిని పొందుతారు. దేనికీ లోటు లేకుండా జీవితమంతా సాఫీగా జరిగిపోతుంది.

ధనిష్టా నక్షత్రంనాడు స్వామిని దర్శిస్తే.. ఐశ్వర్యం లభిస్తుంది. ఎంతో కాలంగా రావలసిన సొమ్ము వెంటనే చేతికి వస్తుంది.

శతభిషంనాడు స్వామివారిని దర్శిస్తే కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి... సకాలంలో వర్షాలు కురిసి మంచి పంటలు పండుతాయి.

ఇక అటు తరువాత వచ్చే పూర్వాభాద్ర నక్షత్రంనాడు స్వామిని దర్శిస్తే ఎన్నో రోజులుగా ఆగిపోయిన పనులు వెంటనే నెరవేరుతాయి.

ఉత్తరాభాద్రనాడు శ్రీనివాసుని దర్శిస్తే చక్కటి సంతానం కలుగుతుంది.

ఇక నక్షత్ర సముదాయంలో చివరిదైన రేవతీ నక్షత్రంనాడు స్వామివారిని దర్శిస్తే సర్వశుభాలూ కలుగుతాయి.
ఎటువంటి అనారోగ్యమైనా క్షణంలో తొలగిపోయి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది.

విష్ణువు అంటే విశ్వం మొత్తం వ్యాపించబడి ఉన్నాడు అని అర్థం. ఆకాశంలో మనకు కనపడే నక్షత్రమండలాలు, గ్రహమండలాలు, సూర్యచంద్రులు అన్నీ ఆ స్వామి విరాట్‌రూపంలోనివే.

అయితే ఒక్కొక్క నక్మ్షత్రంనాడు దర్శిస్తే ఒక్కొక్క ప్రత్యేక ఫలితం ఉంటుంది. మనం భూమిమీద జరుపుకునే ప్రతీ పండుగకు నక్షత్ర మండలానికి, ఎంతో సంబంధం ఉన్నది. ఉదాహరణకు మనం ప్రతీ సంవత్సరం ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే వినాయకచవితి పండుగనే గమనిద్దాం.
ప్రతీ సంవత్సరం భాద్రపద శుద్ధ చవితినాడు విఘ్నేశ్వరరూపంలో కనిపించే నక్షత్ర మండలం సూర్యోదయానికన్నా ముందుగా తూర్పు ఆకాశంలో ఉదయిస్తుంది. అందుకనే ఆ రోజు మనం వినాయకచవితిని జరుపుకుంటాం. ఇంకో విశేషమేమంటే ఆ వినాయక మండలం ప్రక్కన ఆదిశేషుని నక్షత్రమైన ఆశ్లేష ఉండటం వలన వినాయకుడు నాగ యజ్ఞోపవీతుడైనాడు. కాబట్టి ప్రతి ఒక్కరు అవకాశం ఉన్నంత వరకు ఆయన నక్షత్రాలలో స్వామివారి దర్శించుకోవడం శుభ పరిణామం అని ప్రముఖ జ్యోతిష్య పండితులు బమ్మిడిపాటి సుబ్రమణ్య శాస్త్రి తెలిపారు.

# యుద్ధప్రాతిపదికన మాచ్‌ఖండ్ పునరుద్ధరణ పనులు

**సీలేరు కాంప్లెక్స్ సీఈ కె.వి.రాజారావు**

**విశాఖ నుంచి బ్యాక్ ఫీడింగ్ ద్వారా విద్యుత్ సరఫరా**

ముంచంగిపుట్టు, జయ జయహే

భారీ అగ్నిప్రమాదంతో ఒక్కసారిగా నిలిచిపోయిన మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. శనివారం నాటి ప్రమాద సంఘటనపై ఆదివారం సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ ( సీఈ ) కె.వి.రాజారావు తన ముగ్గురు సభ్యుల ఉన్నత స్థాయి బృందంతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. ప్రమాదం జరిగిన కంట్రోల్ రూమ్, ఎక్సైటేషన్ క్యూబికల్స్, మరియు 11 కేవీ బ్రేకర్లను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, స్థానిక ప్రాజెక్టు అధికారులు, సిబ్బందితో సుదీర్ఘ సమీక్ష నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**మొదట 11 కేవీ బ్రేకర్ పేలుడుతోనే..!**

ఈ సందర్భంగా సీఈ కె.వి.రాజారావు మాట్లాడుతూ, శనివారం మొదట 11 కేవీ బ్రేకర్ పేలడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని, దాంతో జనరేటర్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని స్పష్టం చేశారు. మంటలు ఆ తర్వాత 5వ నెంబర్ ఎల్ఏబీటీకి అంటుకుని అక్కడ కూడా పేలుడు సంభవించడంతో ప్రమాద తీవ్రత పెరిగిందన్నారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అదుపు చేయడం అసాధ్యంగా మారిందని వివరించారు.

**వేగంగా సాగుతున్న మరమ్మత్తులు**





ప్రమాదం తర్వాత ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు ఇంజనీరింగ్ విభాగం శ్రమిస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో జరుగుతున్న పనుల జరుగుతున్నాయి.

కాలిపోయిన పాత కేబుల్ వైర్లను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో నూతన కేబుళ్లను వేసే పనులు వేగంగా సాగుతున్నాయి.

పూర్తిగా కాలిపోయిన ప్యానెళ్ల వివరాలను సేకరించిన అధికారులు, కొత్త ప్యానెళ్లను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. ఆరు జనరేటర్లకు సంబంధించిన మెకానికల్ బేరింగులను నిపుణులు నిశితంగా పరిశీలిస్తూ, బాగు చేస్తున్నారు.

**నీటి విడుదల నిలుపుదల:**

తక్షణ చర్యల్లో భాగంగా దుడుమ జలాశయం నుంచి గేట్లు మూసివేసి నీటి విడుదలను నిలిపివేశారు. అలాగే టీపీ డ్యామ్ వద్ద నీటిని సిల్ట్ గేట్లను ఎత్తి పూర్తిగా ఖాళీ చేశారు.

బ్యాక్ ఫీడింగ్ ద్వారా సరఫరా: క్యాంపు పరిధిలో విద్యుత్ ఇబ్బందులు లేకుండా విశాఖపట్నం నుంచి బ్యాక్ ఫీడింగ్ ద్వారా విద్యుత్‌ను దిగుమతి చేసుకొని ప్రస్తుతానికి సరఫరా చేస్తున్నారు.

**నేడు ఏపీజెన్‌కో జలవిద్యుత్ సంచాలకుల పర్యటన:**

మాచ్‌ఖండ్ ప్రమాద తీవ్రత నేపథ్యంలో సోమవారం నాడు ఏపీజెన్‌కో జలవిద్యుత్ సంచాలకులు (డైరెక్టర్) సుజయ్‌కుమార్ తన ప్రత్యేక టెక్నికల్ బృందంతో కలిసి ప్రాజెక్టును సందర్శించనున్నారు. వేగంగా విద్యుత్ ఉత్పత్తి జరిగేలా తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ఈ బృందం దిశానిర్దేశం చేయనుంది.

ప్రస్తుతం జరుగతున్న ఈ పునరుద్ధరణ పనులను సివిల్ ఎస్ఈ జకీర్ హుస్సేన్, మాచ్‌ఖండ్ ఎస్ఈ సీహెచ్.అప్పలాజి, మోతుగూడెం ఈఈ బాలకృష్ణ, మాచ్‌ఖండ్ ఈఈ (జనరేషన్) బి.గోవిందరాజులు, ఈఈ (సివిల్) కురేష్ ప్రధాన్‌లు దగ్గరుండి రాత్రింబవళ్లు పర్యవేక్షిస్తున్నారు.

## బక్రీద్ సెలవుతో ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్ష వాయిదా

**జూన్ 5న ఎకనామిక్స్, మ్యాథమెటిక్స్ పరీక్షలు నిర్వహణ**

**ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష జూన్ 12కు మార్పు**

**ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి వై. నాగేశ్వరరావు**

పార్వతీపురం,జయ జయహే న్యూస్:



బక్రీద్ (ఈద్-అల్-అదా) పండుగ సందర్భంగా ఈ నెల 28వ తేదీన నిర్వహించాల్సిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను వాయిదా వేసినట్లు,సవరించిన తేదీల ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఇంటర్ విద్యాధికారి వై. నాగేశ్వరరావు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి పి. రంజిత్ బాషా ఆదేశాల మేరకు పరీక్షల తేదీలలో మార్పులు చేసినట్లు ఆయన వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం మే 28వ తేదీని బక్రీద్ పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఈ మేరకు మే 28న జరగాల్సిన ఫస్ట్ ఇయర్ జనరల్ ఎకనామిక్స్ పేపర్-1, సెకండ్ ఇయర్ జనరల్ మ్యాథమెటిక్స్ పేపర్-2బి పరీక్షలను జూన్ 5వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు తెలిపారు.అలాగే వొకేషనల్ బ్రిడ్జ్ కోర్సులకు సంబంధించిన మ్యాథమెటిక్స్,బయోలాజికల్ సైన్సెస్ పరీక్షలు కూడా అదే రోజున నిర్వహించబడతాయని చెప్పారు.ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు,సెకండ్ ఇయర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని వివరించారు.అదే విధంగా జూన్ 5న నిర్వహించాల్సిన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వేల్యూస్ పరీక్షను జూన్ 12వ తేదీకి మార్చినట్లు తెలిపారు.విద్యార్థులు ఇప్పటికే జారీ చేసిన హాల్ టికెట్లతోనే పరీక్షలకు హాజరుకావాలని,పరీక్షా కేంద్రాలలో ఎలాంటి మార్పులు లేవని జిల్లా ఇంటర్ విద్యాధికారి వై. నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## ఐ ఎన్ టి యు సి రాష్ట్ర కార్యదర్శిగా గొంతి ఆస్కరరావు

విశాఖపట్నం: జయ జయహే



ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా గొంతి భాస్కరరావు నియామకం అయ్యారు.గొంతి ఆస్కార్ రావు ఐ ఎన్ టి సి అనుబంధం సంస్థ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గా కొనసాగుచున్నారు. అలాగే ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా పనిచేసి అదే సంఘం లో ప్రజాస్వామ్య విలువలు కోసం పోరాటం చేస్తున్నారు. అలాగే "ఉద్యోగ వేదిక " అనే ఉద్యోగ సంఘాల జేఏసీ కి చైర్మన్ గా ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగి గా 1991సం లో అడుగుపెట్టి నేటికీ 35 సం సర్వీస్ పూర్తి చేసి ప్రస్తుతం ఏలూరు జిల్లా అగిరి పల్లి లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గా గజిటెడ్ హోదా లో పనిచేస్తున్నారు. అయన కు ఇద్దరూ కుమార్తెలు డాక్టర్ లు గా స్థిర పడ్డారు. ఇటీవలే కుమారుడు అభిషేక్ లండన్ లో జరిగిన అగ్ని ప్రమాదం లో మృతి చెందారు. మొత్తానికి ఆస్కార్ రావు ఒక కార్మిక నాయకుడి గా ఉద్యోగ సమాజానికి ఎనలేని సేవలు అందిస్తున్నారు.

## రాష్ట్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద నేటి నుంచి 'రైతు గోస - బీజేపీ భరోసా'

(జయ జయహే)

నేటి నుంచి 'రైతు గోస – బీజేపీ భరోసా' పేరిట ప్రత్యేక యాత్రను చేపట్టబోతున్నట్లు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు. ఈ యాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులతో రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎనభై శాతం ధాన్యం కొనుగోలు ఎక్కడ జరిగిందో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలను చూసి సీఎం ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయనకు నచ్చిన జిల్లాకు వెళ్లి క్షేత్రస్థాయిలో నేరుగా రైతులతో మాట్లాడితే, కొనుగోళ్లు ఎంతవరకు జరిగాయో అసలు నిజాలు తెలుస్తాయని హితవు పలికారు. ఈ రెండు రోజుల యాత్రలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద తాము నేరుగా రైతులతోనే మాట్లాడిస్తామని రఘునందన్ రావు పేర్కొన్నారు. తాము రాజకీయాలు చేయాలనుకుంటే వేరేలా చేస్తామని, కానీ తమకు కావాల్సింది కేవలం అన్నదాతల సంక్షేమమేనని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## విద్యుత్ అంతరాయంతో అల్లాడుతున్న పంచాయతీలు

అనంతగిరి/జయ జయహే

అనంతగిరి మండలం వెంగడ పంచాయితీ , కివర్ల పంచాయితీ పినకోట పంచాయతీలకు చెందిన మూడు గ్రామాలు, జీడిమెట్టు, బోనూరు, గడ్డి బంద. గ్రామాలకు అనంతగిరి మండలం, దముకు నుంచి కరెంటు ఈ మూడు పంచాయతీలకు సప్లై ఇవ్వడం జరిగింది. కానీ ఈ పంచాయతీలో ఉన్నటువంటి గ్రామాలు తరచూ కరెంటు పోవడం తక్కువ ఓల్టేజీ సమస్యలు రావడం వల్ల గ్రామస్తులు నిత్య జీవితానికి ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా మధ్యమధ్యన కరెంటు వైర్లు కట్ ఐపోవడము దానివల్ల కరెంటు అంతరాయము ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు .ఈ సమస్యలకు సంబంధిత ఏఈ నిర్లక్ష్యమే ప్రధాన మని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు .పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారుల స్పందించి కరెంటు ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్తు సరఫరా కల్పించాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

## గుర్తు తెలియని మృతదేహం

**గుర్తింపు కొరకు పోలీసుల విజ్ఞప్తి....**

కొయ్యూరు (జయ జయహే) న్యూస్ మే 25



అల్లూరి జిల్లా కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలో డౌనూరు చెక్‌పోస్ట్ దాటిన తరువాత ఎర్రమ్మకొండమ్మ తల్లి గుడి సమీపంలో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం కనిపించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం వడదెబ్బ కారణంగా మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. మృతుని వయస్సు సుమారు 60 సంవత్సరాలు దుస్తులు బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్ లైట్ గ్రీన్, తెలుపు మరియు నలుపు రంగు గడులు గల లుంగీ,నల్ల రంగు కంబలి,మాసిన గడ్డం, సగం నెరిసిన గడ్డం మరియు సగం నెరిసిన జుట్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పై వివరాలకు సంబంధించిన వ్యక్తిని ఎవరైనా గుర్తుపట్టినట్లయితే వెంటనే కొయ్యూరు పోలీస్ వారిని సంప్రదించవలసిందిగా కోరుచున్నారు. సంప్రదించవలసిన నంబర్లు కొయ్యూరు ఎస్ ఐ నెంబర్ 9440904241, మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్ నెంబర్ 9440904218 కి తెలుపగలరు..



## సంతలో పోలీసుల అవగాహన కార్యక్రమం

**సైబర్ నేరాలు, మహిళా భద్రత, రోడ్డు భద్రతపై ర్యాలీ**

కొయ్యూరు :(జయ జయహే)న్యూస్ మే 25

అల్లూరి జిల్లా కొయ్యూరు సంతలో సీఐ బి. శ్రీనివాసరావు మరియు ఎస్సై కిషోర్ వర్మ, సిబ్బందితో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంతకు వచ్చిన మారుమూల గ్రామాల ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీ లు, బ్యాంక్ వివరాలు, పిన్ నంబర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు తెలియజేయవద్దని సూచించారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించి, ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే 100/112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. గంజాయి నియంత్రణ, గంజాయి వినియోగం మరియు అక్రమ రవాణా చట్ట విరుద్ధమని, ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయి సమాచారం ఉంటే పోలీసులకు తెలపాలని హెచ్చరించారు. అనంతరం మహిళలపై నేరాల నిరోధక అవగాహనలో భాగంగా కొయ్యూరు సంత నుండి దొడ్డవరం జంక్షన్ వరకు పోలీస్ సిబ్బంది మరియు ప్రజలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. నినాదాలు, ప్లకార్డులతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పోలీసు అధికారులు పేర్కొన్నారు.



## ఎన్ సీసీ ద్వారా క్రమశిక్షణ, దేశభక్తి జాతీయ సమైక్యత భావాలు

**ఎన్ సీసి క్యాడెట్లను అభినందించిన డీఎస్పీ రఘువీర్ విష్ణు**

భీమవరం (జయ జయహే )

ఎన్ సీసీ ద్వారా క్రమశిక్షణ, దేశభక్తి జాతీయ సమైక్యత భావాలు అలవడతాయని డీఎస్పీ రఘువీర్ విష్ణు అన్నారు. ఇటీవలే సిక్కిం రాష్ట్రంలో ఇండియన్ హిమాలయన్ సెంటర్ ఫర్ ఎడ్వాంచర్ అండ్ ఎకో టూరిజం లో నెల రోజులపాటు కోర్సు చేసిన భీమవరం డిఎన్నార్ సీనియర్ ఎన్ సీసీ సీనియర్ వింగ్ క్యాడెట్లు అంగర శిరీష, పెన్మెత్స శిరీష లను శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో డీఎస్పీ రఘువీర్ విష్ణు అభినందించారు. ఆయన మాట్లాడుతూ తాను కూడా ఎన్ సీసీ సి సర్టిఫికెట్ సాధించానని, తిరుపతి కళాశాలలో ఎన్ సీసీ లో చేరానని, అనేక క్యాంప్ లలో పాల్గొన్నానని అన్నారు. వన్ టౌన్ సిఐ రమేష్ మాట్లాడుతూ బాల్యం నుంచి ఎన్ఎస్ఎస్, ఎన్ సీసీ లో ఉండటం జీవితానికి లక్ష్యం ఏర్పడుతుందని వారిని అభినందించారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, ఎన్ సీసీ మేజర్ డా ఏ వీరయ్య మాట్లాడుతూ శిరీష లు సాధించిన ప్రగతి మన పట్టణానికి ఖ్యాతి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో భట్టిప్రోలు శ్రీనివాసరావు, గంటా సుందర్ కుమార్, డా ఎస్ సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనకు పటిష్ఠ కార్యాచరణలు

**యువత మత్తు కు దూరంగా ఉండాలి**

**పోలీసులు డ్రగ్ డిటెక్షన్ తో ఆకస్మిక తనిఖీలు**

టెక్కలి మే 24 జయ జయహే



ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒకటైన శ్రీకాకుళం జిల్లాలో ఏ ప్రాంతంలో నైనా ఎవరైనా గంజాయి మత్తుకు దూరంగా ఉండాలని సదుద్దేశంతో శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వరరెడ్డి ఐపీఎస్ ఇచ్చిన ఆదేశాల మేరకు టెక్కలి డిఎస్పి డి లక్ష్మణరావు సారధ్యంలో గంజాయి నిర్మూలనకు క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు పోలీస్ శాఖ తీసుకుంటున్నట్లు డి.ఎస్.పి లక్ష్మణరావు తెలిపారు , ఎవరైనా ఇతర మత్తు పదార్థాలు సేవించారా లేదా అనే విషయా న్ని కచ్చితంగా తెలుసుకునేందుకు ప్రత్యేక డ్రగ్ డిటెక్షన్ తో టెక్కలి సబ్ డివిజన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామని ఎస్సై రాము తెలిపారు, ఇందులో భాగంగా పోలీస్ సిబ్బంది అనుమానిత వ్యక్తుల ను తనిఖీలు నిర్వహించారు. పాజిటివ్ వచ్చిన వారికి తగిన కౌన్సిలింగ్ ఇవ్వనున్నామన్నారు నేర నిరూపణ జరిగితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఈ తనిఖీలు నిరంతరం ఆకస్మికంగా నిర్వహిస్తామని గంజాయి , మత్తు పదార్థాలు వినియోగిస్తూ పట్టుబడ్డ నిందితులకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టెక్కలి ఎస్సై రాము స్పష్టం చేశారు.

## మంత్రి కింజరాపును కలిసిన పాశర్ల

టెక్కలి (జయ జయహే)



**టెక్కలి శాసనసభ్యులు మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చం నాయుడు ని నిమ్మడ గ్రామంలో మంత్రి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసిన పాశర్ల ప్రసాద్**

## బక్రీద్ సెలవు ప్రభావం..

**ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ మార్పు**

**మే 28న జరగాల్సిన పరీక్షలు జూన్ 5కి వాయిదా**

**జూన్ 5 నాటి ఎథిక్స్ పరీక్ష జూన్ 12కు మార్పు**

**జిల్లా ఇంటర్మీడియట్ విధ్యాదికారి శివ్వాల తవిటినాయుడు**

విజయనగరం, జయజయహే న్యూస్:



రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యా మండలి నిర్వహిస్తున్న అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల ముందస్తు షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి.బక్రీద్ (ఈద్-అల్-అదా) పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 28వ తేదీని సెలవు దినంగా ప్రకటించింది.ఈ నేపథ్యంలో,ఆ రోజున జరగాల్సిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు విజయనగరం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శివ్వాల తవిటినాయుడు తెలిపారు.ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి పి.రంజిత్ బాషా జారీ చేసిన తాజా ఆదేశాల మేరకు ఈ సవరణలు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

**జూన్ 5న ఎకనామిక్స్-1 మ్యాథమెటిక్స్-2బి పరీక్షల నిర్వహణ**

గతంలో ప్రకటించిన టైం టేబుల్ ప్రకారం మే 28వ తేదీన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు ఎకనామిక్స్-1 మరియు మ్యాథమెటిక్స్-2బి పరీక్షలు జరగాల్సి ఉంది.అయితే ప్రభుత్వ సెలవు కారణంగా వాయిదా పడిన ఈ రెండు కీలక పరీక్షలను వచ్చే నెల,జూన్ 5వ తేదీన యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి తెలిపారు.పరీక్షా కేంద్రాలు,సమయాల్లో ఎలాంటి మార్పు ఉండదని,కేవలం తేదీ మాత్రమే మారుతుందని ఆయన వివరించారు.

**జూన్ 12వ తేదీకి మారిన 'ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్'**

మే 28 నాటి పరీక్షలను జూన్ 5వ తేదీకి రీ-షెడ్యూల్ చేయడం వల్ల,ముందస్తు ప్రణాళిక ప్రకారం జూన్ 5న జరగాల్సిన పరీక్షలపై ఆ ప్రభావం పడింది.దీంతో జూన్ 5న జరగాల్సిన 'ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్' (నైతికత మరియు మానవీయ విలువలు) పరీక్షను అధికారులు వాయిదా వేశారు.ఈ పరీక్షను జూన్ 12వ తేదీన నిర్వహించనున్నట్లు డిఐఈవో శివ్వాల తవిటినాయుడు స్పష్టం చేశారు.విద్యార్థులు ఈ రెండు మార్పులను గమనించాలని కోరారు. జిల్లాలో వివిధ యాజమాన్యాల పరిధిలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, ఇదే విషయాన్ని విరివిగా అంతర్గత వాట్సాప్ గ్రూపుల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.కళాశాల నోటీస్ బోర్డు లో ఈ వివరాలను ప్రదర్శించాలని కోరారు.

# 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకం ఆవిష్కరణ

## ముఖ్య అతిథిగా ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు

## ప్రజల ఆశీర్వాదాలే తన బలమన్న బండారు దత్తాత్రేయ






విశాఖపట్నం, మే 24, జయ జయహే

ప్రజల కథే నా ఆత్మకథని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవిత ప్రస్థానాన్ని ఆవిష్కరించే 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ సభ ఆదివారం విశాఖపట్నం మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ ఆత్మీయ అవలోకన కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. దత్తాత్రేయ రాజకీయ జీవితం, ఆయన చేసిన ప్రజా సేవ, సామాన్య ప్రజలతో ఆయనకు ఉన్న బలమైన అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ... తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఎదురైన క్షేత్రస్థాయి అనుభవాలు, ప్రజలు అందించిన ఆశీర్వాదాలే తన జీవితానికి అసలైన బలమని భావోద్వేగానికి లోనయ్యారు. ప్రజలతో ఉన్న ఆ బంధం వల్లే ఈ పుస్తకానికి 'ప్రజల కథే నా ఆత్మకథ' అనే పేరును ఖరారు చేసినట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఒక నిబద్ధత కలిగిన నాయకుడి ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం ఈ పుస్తకం ద్వారా రాబోయే తరాలకు అందుబాటులోకి రానుందని చెప్పారు. ఈ వేడుకకు ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొని 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ... సామాన్య ప్రజల మధ్య నుంచి ఎదిగి, గవర్నర్ వంటి అత్యున్నత పదవిని అధిరోహించిన బండారు దత్తాత్రేయ జీవిత ప్రయాణం నేటి యువతకు ఎంతో ఆదర్శప్రాయమని కొనియాడారు.




### వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

# ఘనంగా ప్రారంభం

**ప్రపంచ స్థాయి క్రీడలకు విశాఖ వేదిక కావాలి**

**ఒలింపిక్ స్థాయి క్రీడలకు విశాఖ క్రీడాకారులు సిద్ధం కావాలి**

**రాష్ట్ర ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు**

విశాఖపట్నం మే 24, జయ జయహే

వేసవి శిక్షణా శిబిరాలలో విద్యార్థులు క్రీడ నైపుణ్యతను పెంపొందించుకొని ఒలింపిక్ స్థాయి క్రీడలకు విశాఖ క్రీడాకారులు సిద్ధం సిద్ధం కావాలని ,ప్రపంచ స్థాయి క్రీడలకు విశాఖ వేదిక కావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. ఆదివారం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో జీవీఎంసీ నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు పశ్చిమ ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై సభా అధ్యక్షత వహించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య లతో కలిసి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా శిక్షణ శిబిరాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసానికి క్రీడలను ఒక సాధనంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. గత రెండు సంవత్సరాల నుండి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు అని భార్య కారణాలవలు నిర్వహించడం జరగలేదని, ఈ సంవత్సరం జీవీఎంసీ ఎంతో బాధ్యతాయుతంగా ఈ వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నందుకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ కు అభినందనలు తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న క్రీడా మైదానాలను సంపూర్ణంగా ఉపయోగించుకుని, నిపుణులైన కోచ్‌ల పర్యవేక్షణలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం ద్వారా ఎంతోమంది ప్రతిభావంతులైన అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు వెలుగులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను కేవలం చదువుకే పరిమితం చేయకుండా, వారి ఆసక్తి మేరకు క్రీడల్లో ప్రోత్సహించాలని కోరారు. వారికి సమ్మర్ క్యాంపులు చాలా దోహదపడతాయన్నారు. ముఖ్యంగా విశాఖ మహానగరాన్ని క్రీడల హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, విశాఖ క్రీడలకు నిలయం గా, స్పోర్ట్స్ కల్చర్ సిటీగా ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ నగరంలోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను చిన్నతనం నుంచే గుర్తించి ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ వేసవి శిక్షణా శిబిరాలను విస్తృతంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరాలు నిర్వహించేందుకు 15 రోజుల నుండి నిరంతర కార్యాచరణ జీవీఎంసీ జరిపిందన్నారు. మే 25 నుండి నుండి ప్రారంభమైన ఈ శిబిరాలు జూన్ నెల 6 వ తేదీ వరకు పది రోజులపాటు ఉదయం 6 నుండి 8 గంటల వరకు కొనసాగుతాయని, మే 29 ,31 తేదీలలో ప్రభుత్వ సెలవులు ఉన్నందున ఆ రెండు రోజులు శిబిరాలు జరగవని అన్నారు. ఈ శిబిరాలలో 486 క్రీడా శిక్షణ నిపుణుల పర్యవేక్షణలో 12036 మంది విద్యార్థిని విద్యార్థులు 41 క్రీడాంశాలలో పాల్గొని క్రీడా శిక్షణను పొందుతారన్నారు. పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ప్రతిరోజు వారికి ఒక గుడ్డు, బిస్కెట్ ప్యాకెట్, పప్పు చెక్కి, తాగునీరు ఆహారంగా అందిస్తామని, 25వ తేదీన ఒకరోజు ప్రత్యేకంగా బటర్ మిల్క్ కూడా వారికి ఏర్పాటు చేశామని, అలాగే పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు ప్రతి ఒక్కరికి "టీ" షర్టు తో పాటు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్ కూడా అందించడం జరుగుతుందన్నారు.



### చెరువుల బలోపేతంతో

# రైతాంగం అభివృద్ధి: ఎమ్మెల్యే గంటా

ఆనందపురం, మే 24, జయ జయహే

మండలంలోని రెండు చెరువుల పునరుజ్జీవానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఆనందపురం పంచాయతీ పుర్లివాని చెరువు, గండిగుండం పంచాయతీ గౌరివాని చెరువు లను ఒక్కొక్కటి సుమారు రూ.50 లక్షలతో అభివృద్ధి చేయనున్నారు. చెరువుల బలోపేతం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని గంటా ఈ సందర్భంగా పేర్కొన్నారు. చెరువుల పటిష్టంతో పాటు సోలార్ దీపాలు, ఆర్.సి.సి. బెంచీలు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, చిల్డ్రన్ పార్కులతో ఆహ్లాదకరమైన వాతావరణం అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు నిర్మలాదేవి, కె. ఆంజనేయులు, సత్యనారాయణ, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాత్రాజు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.




# ఉత్తరంలో బీఎల్‌ఏ, సర్‌లకు అవగాహన సదస్సు

**పాల్గొన్న కేకే రాజు**

విశాఖపట్నం, మే 24, జయ జయహే

వైసీపీ ఉత్తర నియోజకవర్గం బీఎలఏ, సర్ లకు సంబంధించిన అవగాహన సదస్సు ఆదివారం గ్రాండ్ మిలాన్ ఫంక్షన్ హాల్‌లో విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సన్యాసి పాత్రుడు, రొంగలి జగన్నాధం, సతీష్ వర్మ, రాష్ట్ర ,మాజీ జిల్లా వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ,మాజీ జీవీఎంసీ కార్పొరేటర్‌లు ,రాష్ట్ర పార్టీ కార్యవర్గం సభ్యులు నగర జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు,రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు ,మాజీ రాష్ట్ర జిల్లా వివిధ కార్పొరేషన్ డైరెక్టర్ ,వార్డు అధ్యక్షులు,బూత్ లెవల్ ఏజెంట్లు,ముఖ్య నాయకులు ,సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిశీలకులు పేడాడ రమణికుమారి పాల్గొన్నారు.



### నేడు జీవీఎంసీలో

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**10 జోన్‌లలో పి జి ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహణ**

**జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.**

విశాఖపట్నం, మే 24, జయ జయహే

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, పునర్వ్యవస్థీకరణ చెందిన భీమిలి, మధురవాడ , ఈస్ట్, వెస్ట్, సౌత్ ,నార్త్, పెందుర్తి ,గాజువాక, అగనంపూడి అనకాపల్లి జోన్ల కార్యాలయాల్లోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" సోమవారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడునని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు,హారికల్చర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై 2026 మే 25 వ తేదీ సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు జివిఎంసి కమిషనర్ తెలిపారు.

1) జీవీఎంసీ వెస్ట్ జోన్ కార్యాలయం 52 వ వార్డు లో గల ఎన్. ఎ .డి కొత్త రోడ్డు , గౌరీ నగర్ లో పశ్చిమ నియోజకవర్గం కార్యాలయం నందు ఏర్పాటు చేయడమైనది.

2) నార్త్ జోన్ కార్యాలయం 51 వ వార్డులో మాధవధార ఉడా లేఅవుట్, ఆర్ . టి. ఎ ఆఫీస్ రోడ్డు, పంప్ హౌస్ వెనుక ఉత్తర నియోజకవర్గం కార్యాలయం లో ఏర్పాటు చేయడమైనది.

3) అగనంపూడి జోన్ కార్యాలయం 85వ వార్డులో పెదమడక, శివాలయం రోడ్డు , వినాయక టెంపుల్ సమీపములో గల రాజీవ్ గాంధీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేయడమైనది.

కావున ప్రజలు ఈ పై జోన్ల ప్రదేశాలను గమనించవలసిందిగా కోరుచూ ,మిగిలిన అన్ని జోన్ల కార్యాలయాలు యధాస్థానంలో ఉన్నవని తెలియపరచడమైనది.



### జనగణనను పరిశీలించిన

# సెన్సస్ డిప్యూటీ రిజిస్ట్రార్

**విశాఖలో ఇండ్ల గణన ప్రక్రియ అభినందనీయం**

విశాఖపట్నం, మే 24, జయ జయహే :

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా మే 1 నుండి మే 30 వరకు నిర్వహిస్తున్న మొదటి దశ ఇండ్ల గణన ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఆదివారం న్యూఢిల్లీ నుంచి వచ్చిన సెన్సస్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎల్.ఎన్. మూర్తి మధురవాడ జోన్‌లో పర్యటించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ (రెవెన్యూ) డీవీ రమణమOర్తి సిటీ సెన్సస్ ఆఫీసర్ తో కలిసి పర్యటించి విశాఖలో ఇండ్ల గణన ప్రక్రియ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా ఇండ్ల గణన నిర్వహిస్తున్న నంబర్లు 260, 261, 262 ప్రాంతాలను పరిశీలించి, మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో జనగణన కార్యక్రమం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, అధికారుల పర్యవేక్షణలో అత్యంత నాణ్యతతో, వేగవంతంగా నిర్వహించబడుతోందని ఆయన అభినందించారు. అలాగే, ఈ ఇండ్ల గణన ప్రక్రియలో ఏ ఒక్క గృహం కూడా మినహాయించకుండా గణన చేపట్టాలని, రాష్ట్రానికి లభించాల్సిన నిధులు, ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి పథకాలు మరియు సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనలో జనగణనకు ఎంతో ప్రాధాన్యం ఉందని ప్రజలకు అవగాహన పరచాలని అదనపు కమిషనర్ రమణమూర్తికి డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ సెన్సస్ సూచించారు. ఈ కార్యక్రమంలో మధురవాడ జోన్ జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, ఇండ్ల గణన సూపర్వైజర్లు మరియు ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.



### ఫీల్డు ఉద్యోగులకు ఎఫ్ ఆర్ ఎస్

# మినహాయింపు ఇవ్వాలి

**ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం**

**రాష్ట్ర అధ్యక్షుడు గొంతి ఆస్కార్ రావు డిమాండ్**


విశాఖపట్నం, మే 24, జయ జయహే :

క్షేత్ర స్థాయి ఉద్యోగులకు బయో మెట్రిక్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొంతి ఆస్కార్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం జిల్లా, నగర కార్యవర్గ ఎన్నికలను పెన్షనర్స్ భవనంలో చీఫ్ అడ్వైజర్ ఎస్‌వీ రమణ, కృష్ణాజీల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉద్యమాల ద్వారా బయో మెట్రిక్ హాజరు విధానానికి మినహాయింపు పొందామని ఇప్పుడు కూడా అలాగే ఎఫ్ ఆర్ ఎస్ విధానం నుంచి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలన్నారు. గ్రామీణ, గిరిజన గ్రామాల్లో పని చేసే ఉద్యోగులకు నెట్ వర్క్ సరిగ్గా లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. తక్షణమే ఫీల్డు సిబ్బందికి మాత్రమే ఎఫఆరఎస్ అటెండెన్స్ విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిలిపి వేసిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్లు 143, 32 ద్వారా సర్దుబాటు వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సిటీ నూతన కార్యవర్గం: సిటీ అధ్యక్షుడు వై గోపి, ఉపాధ్యక్షులు కమల్‌కుమార;్‌వై. యోగిత, ఎస్‌వీ అశోక్ కుమార్, కార్యదర్శి ఎస్. గంగా ధరరావు, జాయింట్ సెక్రటరీలు జి. సుజాత, జి. గంగా భవానీ, బి. కిషోర్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు కే. సత్తిరాజు, డి. వెంకటేష్, ఎల్ శ్రీనివాసరావు, ట్రెజరర్ బి. శంకరావు ఎన్నికయ్యారు.

# మానవాళికి వరప్రదాయిని 3డి బయోప్రింటింగ్

(సి.హెచ్.ప్రతాప్)

3డి బయోప్రింటింగ్ అనేది అవయవ పునఃస్థాపన రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఒక అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం. ఈ అధునాతన విధానంలో సజీవ కణాలు, జీవ సిరా, ప్రత్యేక జీవ పదార్థాలను ఉపయోగించి మానవ కణజాలం వంటి నిర్మాణాలను లేదా అవయవాల వంటి ఆకృతులను సృష్టిస్తారు. సాంప్రదాయకంగా దాతల అవయవాల కోసం రోగులు సుదీర్ఘకాలం ఎదురుచూడాల్సిన దుస్థితిని పూర్తిగా నిర్మూలించడమే ఈ వినూత్న ఆవిష్కరణ యొక్క ప్రధాన ఆశయం.



మానవ శరీరంలో ఏదైనా ముఖ్యమైన అవయవం దెబ్బతిన్నప్పుడు, దానిని సంపూర్ణంగా పునఃస్థాపించడం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. ప్రస్తుతం మూత్రపిండాలు, కాలేయం, గుండె వంటి కీలక అవయవాల వైఫల్యం సంభవించినప్పుడు దాతల అవయవాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. అయితే దాతల తీవ్ర కొరత, శరీర రోగనిరోధక వ్యవస్థ ఆ అవయవాలను తిరస్కరించే ప్రమాదం, నిరీక్షణ సమయం వంటి తీవ్ర సవాళ్లు ఉన్నాయి. ఈ సంక్లిష్ట సమస్యలకు శాస్త్రీయ పరిష్కారంగా 3డి బయోప్రింటింగ్ ఒక ఆశాజనక మార్గంగా అవతరిస్తోంది. ఇందులో రోగి యొక్క స్వంత కణాలను సేకరించి, వాటి ద్వారా కావలసిన ఆకారం, పరిమాణం, నిర్మాణంతో కూడిన కణజాలాన్ని ల్యాబొరేటరీలలో సిద్ధం చేసే ప్రయత్నం జరుగుతుంది.

ఈ అద్భుత ప్రక్రియలో 3డి ప్రింటర్ వంటి ఒక అత్యంత అధునాతన యంత్రం కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణ ప్లాస్టిక్ లేదా లోహాలకు భిన్నంగా, ఈ యంత్రం జీవకణాలతో కూడిన ప్రత్యేక జీవ సిరాను ఒక పొరపై మరొక పొరగా అమర్చుకుంటూ పోతుంది. అవయవానికి అవసరమైన రక్తనాళాలు, సహాయక నిర్మాణాలు, అంతర్గత కణజాల అమరికను ఖచ్చితత్వంతో రూపొందించే విధంగా ఈ ముద్రణ సాగుతుంది. ఇలా ల్యాబొరేటరీలలో రూపుదిద్దుకున్న సజీవ కణజాలం భవిష్యత్తులో దెబ్బతిన్న అవయవాలను పునరుద్ధరించడానికి లేదా సంపూర్ణమైన కొత్త అవయవాల తయారీకి అద్భుతంగా ఉపయోగపడుతుంది.



ఈ సాంకేతికత వల్ల లభించే అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే, ఇది వ్యక్తిగత వైద్య విధానానికి సంపూర్ణంగా సరిపోతుంది. రోగి యొక్క స్వంత కణాలనే ఇందులో వినియోగించడం వల్ల అవయవాన్ని శరీరం తిరస్కరించే అవకాశాలు ముప్పై శాతానికి పైగా తగ్గుతాయి. అంతేకాకుండా సరికొత్త ఔషధాల సామర్థ్యాన్ని పరీక్షించడానికి కూడా ఈ సాంకేతికత అద్భుతంగా తోడ్పడుతుంది. ఉదాహరణకు, ఒక కొత్త మందు మానవ కణజాలంపై చూపే ప్రభావాన్ని విశ్లేషించడానికి ఈ బయోప్రింటెడ్ కణజాల నమూనాలను ఉపయోగించవచ్చు. దీనివల్ల మూగజీవాలపై చేసే ప్రయోగాల తీవ్రత గణనీయంగా తగ్గుతుంది.
అయినప్పటికీ, ఈ రంగం ఇంకా పూర్తిస్థాయి పరిణితిని సాధించలేదు. గుండె, కాలేయం, మూత్రపిండాల వంటి సంక్లిష్ట అవయవాలను నూటికి నూరు శాతం క్రియాశీలంగా ముద్రించడం నేటికీ శాస్త్రవేత్తలకు ఒక పెద్ద సవాలుగానే మిగిలింది. నిరంతర రక్తప్రసరణను ఏర్పాటు చేయడం, కణాల దీర్ఘకాలిక మనుగడను కాపాడటం, యాంత్రిక బలాన్ని చేకూర్చడం వంటి అంశాలపై మరింత పరిశోధన జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్నత పరిశోధనా కేంద్రాలు, విశ్వవిద్యాలయాలు, వైద్య సంస్థలు ఈ అడ్డంకులను అధిగమించేందుకు వేగంగా కృషి చేస్తున్నాయి.

భవిష్యత్తులో ఈ 3డీ బయోప్రింటింగ్ విధానం అవయవ మార్పిడి, పునరుత్పాదక వైద్యం, ఔషధాల అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రోగులు దాతల కోసం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, తమ స్వంత కణాలతోనే తయారైన నూతన అవయవాన్ని పొందే సుదినం త్వరలోనే రానుంది. అందుకే వైద్య విజ్ఞాన శాస్త్ర చరిత్రలో దీనిని ఒక అసాధారణమైన విప్లవాత్మక ఆవిష్కరణగా



## ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసమే పాటు పడాలి

**నర్సీపట్నంలో వైద్య కళాశాల నిర్మాణం నిలిచిపోవడం విచారకరం**

**తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్**

నర్సీపట్నం (జయ జయహే)

ప్రభుత్వాలు ఏవైనా ప్రజా సంక్షేమం కోసమే పాటు పడాల్సిన అవసరం ఉందని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ వ్యాఖ్యానించారు. 2022లో అప్పటి వైసిపి ప్రభుత్వం నిర్మాణం ప్రారంభించిన నర్సీపట్నంలోని వైద్య కళాశాల వద్దకు రామ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి నిర్మాణాలను శనివారం ఉదయం పరిశీలించారు. క్షేత్ర స్థాయి పర్యటన అనంతరం రామ్ మీడియాతో మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం నిర్మాణాలు ప్రారంభించిన కొద్ది కాలం తర్వాత ప్రజలు వైసీపీని గద్దె దించిన సంగతి తెలిసిందేనన్నారు. అయితే ప్రజలు ఎంతో విశ్వాసంతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే ప్రజలకు మౌలిక వసతులలో ఒకటైన వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణమన్నారు. నర్సీపట్నంలో ఇప్పటికీ నిర్మాణం పూర్తికాని వైద్య కళాశాల భవనాలే కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నం ప్రాంతంలోనే పరిస్థితి ఇలా ఉండడం విచారకరమని పేర్కొన్నారు. వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే ముఖ్యంగా స్థానికంగా ఉన్న ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వంద లాది మంది నర్సీపట్నం వైద్య కళాశాల కేంద్రంగా మంచి నైపుణ్యం గల వైద్యులుగా సమాజానికి ఉపయోగపడతారన్నారు. అంతేకాకుండా వైద్య కళాశాల చుట్టుపక్కల ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని, ఈ సందర్భంగా రామ్ అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, శాసనసభ స్పీకర్, ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు కూడా వైద్య కళాశాల నిర్మాణం పూర్తయ్యాలే చూడాలని కోరారు.

**ముగ్గురు పిల్లలు అంశంపై మహానాడులో తీర్మానం చేయాలి**

రాష్ట్రం మరింతగా పురోగతి సాధించాలంటే ఎక్కువ మంది పిల్లలను కనాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు పై బి.వి.రామ్ తనదైన శైలిలో స్పందించారు. మూడో బిడ్డ పుడితే 30 వేల రూపాయలు, నాలుగో బిడ్డ పుడితే 40 వేల రూపాయలు ఇస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఈ విషయంలో తన వైఖరిని మరింత స్పష్టంగా ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. ముగ్గురు లేదా నలుగురు పిల్లలు ఉన్న వారికి మాత్రమే పార్టీ టికెట్ ఇస్తుందని ప్రకటిస్తూ మహానాడులో తీర్మానం చేయాలన్నారు. అప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలపై పారదర్శకత వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిందాద నూకేశ్వరరావు, బొల్లినేని వెంకటేశ్వరరావు, కే.వినోద్, కే.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



## మరో 3 రోజులు భగభగలే...!

**మధ్యాహ్నం వేళ ఇల్లు కదిలి వెళ్లొద్దంటున్న వాతావరణ శాఖ**

**భానుడి ప్రతాపాన్ని తట్టుకోలేక వెలవెలబోతున్న విశాఖ రోడ్లు**

విశాఖపట్నం, మే 24, జయ జయహే :

భానుడి ప్రతాపంతో రాష్ట్ర ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రచండుని తీవ్రత తట్టుకోలేక విశాఖలో మధ్యాహ్నం పూట బయటకు రావడం మానేస్తున్నారు. తీవ్ర ఉక్కపోత ఉండడంతో విశాఖ వాసులు బెంబేలెత్తిపోతున్నారు. మరో 3 రోజుల పాటు ఉష్ణోగ్రతలు ఇలాగే కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు అంటున్నారు. రాష్ట్రంలో ఎండ తీవ్రత రికార్డు స్థాయిలో నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. మరో మూడు రోజులు పాటు ఇదే తీవ్రత కొనసాగే అవకాశం ఉందన్నారు. వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 మధ్య ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. అత్యవసర ప్రయాణాల్లో తప్పనిసరిగా మంచినీరు వెంట తీసుకుని వెళ్లాలన్నారు. ఇవాళ సీజన్లోనే గరిష్ఠ ఉష్ణోగ్రత తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 48.3డిగ్రీలు, పశ్చిమగోదావరి జిల్లా తణుకు, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1డిగ్రీలు నమోదైందని పేర్కొన్నారు. 13 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు దాటినట్లు తెలిపారు. 17 జిల్లాల పరిధిలోని 174 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని ఆయన వెల్లడించారు. ఇందులో ముఖ్యంగా ఏలూరు 23, తూర్పుగోదావరి 21, పశ్చిమ గోదావరి 17, కృష్ణా 16, బాపట్ల 15, ఎన్టీఆర్ 14, పల్నాడు 13, కోనసీమ 12, కాకినాడ 11 మండలాల్లో ఎండ ఉధృతి ఎక్కువగా చూపిందన్నారు. మే నెల 25వ తేదీ సోమవారం 29 మండలాల్లో తీవ్రవడగాల్పులు, 166 మండలాల్లో వడగాల్పులు, మంగళవారం 50తీవ్ర, 205 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.



## మత్స్యకారుడి మెడికల్ ఖర్చులకు వాసుపల్లి చేయూత

**ఆసుపత్రికి వెళ్లి పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్**

విశాఖపట్నం (జయ జయహే)

మత్స్యకారుడి మెడికల్ ఖర్చులకు దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్సిపి సమన్వయ కర్త వాసుపల్లి గణేష్ కుమార్ ₹.10,000/–లు చేయూతనందించారు. ఉప్పాడ ప్రాంతంలో గల మంగమారి పేటకు చెందిన 14 గ్రామాల ప్రెసిడెంట్ దూడ అచ్చయ్య రావు బీచ్ రోడ్డు స్థానిక ఆసుపత్రిలో ఆపరేషన్ జరిగి చికిత్స పొందుతున్నారు. స్థానిక నేతల ద్వారా విషయం తెలుసుకున్న వాసుపల్లి గణేష్ కుమార్ ఆసుపత్రికి వెళ్లి భరోసా కల్పించారు. దక్షిణ నియోజకవర్గ ప్రజలంటే తన కుటుంబ సభ్యులుగా భావించే వాసుపల్లి గణేష్ కుమార్ తన వర్గమైన మత్స్యకారులకు కష్టం వస్తే హుటాహుటిన స్పందించే నాయకుడిగా వాసుపల్లి గణేష్ కుమార్ అందిస్తున్న ఆర్థిక భరోసాలో భాగంగా మరోసారి దాతృత్వం చాటుకున్నారు. దూడ అచ్చయ్యరావును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉప్పాడ ప్రాంతంలో ఉన్న 14 గ్రామాల ప్రజల ఆశీస్సులు ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ గా అందించిన సేవల ఆశీస్సులు మెండుగా ఉంటాయని వాసుపల్లి గణేష్ కుమార్ ఆయనకు ధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జహీర్ అహ్మద్, స్టేట్ బీసీ సెల్ సెక్రటరీ లండ రమణ,జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు,వైసీపీ నాయకులు వాసుపల్లి ధనరాజు, గంటా దాసు, సూరడ లక్ష్మణరావు , 18 వ వార్డు వైసిపి ప్రెసిడెంట్ ఉమ్మడి కళ్యాణ్, మరుపల్లి పరదేశి, లక్ష్మణరావు, దక్షిణ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్,వాసు తదితరులు పాల్గొన్నారు.



## స్ట్రాంగ్ రూమ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి మే 28 జయ జయహే

అనకాపల్లి నియోజకవర్గ చింత నిప్పుల అగ్రహారం పి ఎ సి ఎస్ వద్ద జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ నుండి మంజూరైన సుమారు 6. 82 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ సోలార్ పవర్ సౌకర్యం ఇవన్నీ స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శనివారం ప్రారంభోత్సవం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే పి గోవింద్ సత్యనారాయణ, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, డిసిఎంఎస్ చైర్మన్ కె బాలాజీ పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన కూటమి కార్యకర్తలు అభిమానులు ఉద్దేశించి ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ బ్యాంకు టర్న్ అవర్ 15 కోట్లు అయితే ఏడు కోట్ల రూపాయలు బంగారు రుణాలతో టర్న్ అవర్ జరుగుతున్నదని గడిచిన ఈ ఆరు మాసాల్లో నాలుగు కోట్ల రూపాయలు వ్యాపారం జరిగిందని, ప్రైవేటు బ్యాంకుల కన్నా ఎక్కడ వడ్డీ రేటు తక్కువ అని తద్వారా బంగారంపై ఎక్కువ రుణాలు తీసుకునే వెసులుబాటు ఇది సహకార బ్యాంకు లు కల్పిస్తున్నాయని లక్ష రూపాయల వరకు వ్యవసాయంపై వడ్డీ లేని రుణాలు ఇస్తున్నారని ప్రజలకు రైతులకు మేలు చేయాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బ్యాంకులని ఆయన పేర్కొన్నారు ప్రైవేట్ బ్యాంకుల్లో రెండు లక్షలు వరకే బంగారు రుణాలు ఇస్తారని అదే బ్యాంకుల్లో 10 లక్షలు వరకు బంగారం పై రుణాలు ఇస్తారని ప్రపంచ దేశాల కన్నా మన దేశంలో ఎక్కువగా బంగారం కొనుగోలు జరుగుతుందని తద్వారా కుటుంబానికి ఆధారంగా ఆర్థిక సంక్షోభంలో ఉన్న మన దేశం ముందుకు నడుస్తుందని ఆయన పేర్కొన్నారు ఇల్లు కట్టుకోవడానికి కూడా రుణాలు ఐదు లక్షల వరకు ఈ బ్యాంకుల ద్వారా ఇస్తున్నారని వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరడం జరిగింది ఈ ప్రభుత్వం ప్రజా పక్షపాతని అభివృద్ధి పరంగా బాటలు వేస్తూ సంక్షేమ పథకాలు అందిస్తుందని ఈ గ్రామం ద్వారా వెళ్లే మెయిన్ రోడ్డు కు సరేనా రోడ్డు నిర్మాణం త్వరలో పూర్తి చేస్తామని అలాగే క్వారీ లారీలు వెళ్లేందుకు పది కోట్ల రూపాయలతో ప్రత్యేక రోడ్డును ఏర్పాటు చేస్తున్నామని అది సంవత్సరంలోపు పూర్తవుతుందని ఆయన పేర్కొన్నారు అలాగే సోలార్ విద్యుత్తు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నదని వీటికి కూడా బ్యాంకు రుణాలు కూడా అందిస్తున్నాయని ఎస్సీ ఎస్టీ వర్గాలకు పూర్తి సోలార్ విద్యుత్ తీసుకుందని వీటిని అన్నిటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు అదే విధంగా సిహెచ్ అన్నగ్రహారం వద్ద పంట రుణాలు ప్రమాద బీమా క్లైములు, సాధారణ భీమా క్లైములు, ఎస్సీ,ఎస్టీ రుణాలు, ఎస్ హెచ్ జి రుణాలు కలిపి మొత్తం 15.50కోట్లు రుణాలు లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం అని చేపట్టారు ఈ కార్యక్రమంలో పి ఏ సి ఎస్ చైర్మన్ బంటు రవి మండల నాయకులు చదరం నాగేశ్వరరావు గంగుపాం జగదీష్ పిఏసిఎస్ డైరెక్టర్ గనిరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు

## ఉష్ణతాపాన్ని తగ్గించేందుకు పోర్టు యత్నం

**బీచ్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డులో వాటర్ ఫాగింగ్**



విశాఖపట్నం, మే 24, జయ జయహే :

నగరంలో కొనసాగుతున్న తీవ్రమైన ఎండల నేపథ్యంలో విశాఖ వాసులకు కొంత ఉపశమనం కలిగించేలా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ వాటర్ ఫాగింగ్ను చేపట్టింది. ఆదివారం నగరంలోని ఆర్కే బీచ్ రోడ్, రైల్వే స్టేషన్ రోడ్డులో వాటర్ ఫాగింగ్/మిస్ట్ కానన్ వాహనాన్ని ఏర్పాటు చేసింది. దీని ద్వారా నిరంతరం ఆయా ప్రాంతంలో నీటిని సన్నని జల్లు ల రూపంలో వెదజల్లడం ద్వారా కొంతమేరకు ఎండవేడిమి నుంచి ఉపశమనం కలుగుతుంది. ఈ ఫాగింగ్ కార్యక్రమం ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆర్కే బీచ్ నుంచి అప్పుఘర్ ప్రాంతం వరకు, రైల్వే స్టేషన్ రోడ్డు అలాగే ప్రజలు అధికంగా రాకపోకలు చేసే ఇతర ప్రాంతాల్లో నిర్వహించబడుతుంది. దీని ద్వారా తీవ్ర వేసవి ఉష్ణోగ్రతల నుంచి ప్రజలకు కొంత మేర ఉపశమనం కలుగుతుందని భావిస్తున్నారు. బీచ్ రోడ్డుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు మరియు సందర్శకులు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ప్రస్తుత ఎండల తీవ్రత నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు. ఈ మిస్ట్ కాననను ఏర్పాటు చేయడం ద్వారా పరిసర ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుంది, వాతావరణ పరిస్థితులు మెరుగుపడే వరకు ప్రజలు ఇబ్బందులు పడకుండా తాత్కాలికంగా ఈ ఏర్పాటు చేసినట్లు పోర్ట్ యాజమాన్యం ప్రకటించింది.

For a pure tomorrow... జయహో

# ఏఐతో నకిలీ బికినీ ఫొటోలు

## నెట్టింట వైరల్ కావడంపై నటి రుక్మిణీ ఆగ్రహం

'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కొన్ని బికినీ ఫోటోషుట్ క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా కనిపించడంపై న టి రుక్మిణీ వసంత్ ఆగ్రహం చెందారు. గ్రీన్ కలర్ బికినీ ధరించి ఆమె స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్నట్లు ఉన్న ఈ విజువల్స్ నెటిజన్లను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేశాయి. చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు ఉండటంతో ఇది ఏదైనా అధికారిక షుట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తంచేశారు. అయితే ఈ వివాదంపై తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నెట్‌లో తన పేరిట సర్క్యులేట్ అవుతున్న బికినీ చిత్రాలన్నీ పూర్తిగా ఎఐ ద్వారా సృష్టించిన నకిలీ ఫోటోలని ఆమె స్పష్టం చేశారు. ఆ చిత్రాలు పూర్తిగా తప్పుడు సమాచారంతో, కల్పితంగా సృష్టించబడినవని ఆమె పేర్కొన్నారు. బాధ్యతా రాహిత్యంగా ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఇటువంటి మార్ఫింగ్ కంటెంట్‌ను తయారు చేయడం మరియు వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన టీమ్ చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఫోటోలను సృష్టించిన వారిపై, అలాగే వీటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు రుక్మిణి వెల్లడించారు. నెటిజన్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయవద్దని, వాటిని ప్రోత్సహించవద్దని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.







## పెద్ది విజయంపైనే రామ్‌చరణ్ ఆశలు

### బుచ్చిబాబు దర్శకత్వానికి కూడా సవాలే

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.... ఆర్ఆర్ఆర్ తర్వాత గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. అయితే ఆ తరువాత వచ్చిన సినిమాలు మాత్రం ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయాయి. దీంతో ఇప్పుడు చరణ్ కెరీర్‌లో రాబోయే రెండు ప్రాజెక్టులు అత్యంత కీలకంగా మారాయి. ఆచార్యలో కీలక పాత్ర పోషించినప్పటికీ ఆ చిత్రం ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అనంతరం భారీ అంచనాల మధ్య విడుదలైన గేమ్ ఛేంజర్ కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. స్టార్ దర్శకుడు, భారీ బ్జడెట్, భారీ తారాగణం ఉన్నప్పటికీ సినిమా ప్రేక్షకుల అంచనాలను పూర్తిగా అందుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు అభిమానుల ఆశలన్నీ చరణ్ తదుపరి చిత్రం 'పెద్ది'పై నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది.





## నాగార్జునకు మే 23 స్పెషల్

### తొలి చిత్రం విక్రమ్ విడుదలై 23 ఏళ్లు

తన జీవితంలో 'మే 23' ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. 'విక్రమ్' నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా' అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన 'హీరో' సినిమాకు రీమేకగా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక తెరకెక్కిస్తున్నారు. 'కింగ్ 100'అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. నాగార్జున ఇందులో పలు రకాల గెటప్పుల్లో కనిపిస్తారని, ఆయన పేరు చెప్పగానే శివ, రక్షకుడుతోపాటు, 'కూలీ'లో పోషించిన సైమన్ లాంటి స్టైలిష్ పాత్రలు గుర్తొస్తాయని, వాటన్నిటీనీ గుర్తుచేసేలా 'కింగ్ 100' ఉంటుందని దర్శకుడు ఇటీవల తెలిపారు.

## లెనిన్ టీజర్ విడుదల

అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోం ది. ఇప్పటికే సినిమా అనౌన్స్‌మెంట్‌తో మంచి అంచనాలు ఏర్పడగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది.ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంగా, 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుకతోపాటు మాస్ ఎలిమెంట్స్ కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన చెప్పిన డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మనోడు వస్తున్నాడు నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా అంటూ అఖిల్ చెప్పిన డైలాగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ డైలాగుల్లో కనిపించిన యాటిట్యూడ్, స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక టీజర్ విడుదలపై నాగార్జున కూడా స్పందించారు. తనకు ఈ టీజర్ ఒక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. టీజర్ మొత్తం ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా అనిపించిందని అభిప్రాయపడ్డారు. మంచి కమ్‌బ్యాక కోసం ఎదురుచూస్తున్న ఆయనకు 'లెనిన్' మంచి మైలురాయిగా మారుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ చూస్తుంటే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి.



Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com